


నగరంపై మంచుదుప్పటి



నగర శివారునున్న సుజాతానగర్‌లో శుక్రవారం ఉదయం దట్టమైన మంచు కురుస్తున్న దృశ్యం

- ఉదయం పది గంటల వరకూ ప్రభావం
- శివారు ప్రాంతాల్లో 100 మీటర్లు, ఎయిర్‌పోర్టులో 500 మీటర్ల కంటే తక్కువగా విజిబిలిటీ

విశాఖపట్నం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): నగరం, పరిసర ప్రాంతాలను శుక్రవారం పొగమంచు కప్పేసింది. తెల్లవారు జాము నుంచి ఉదయం ఎనిమిది, కొన్నిచోట్ల పది గంటల వరకూ మంచు కురిసింది. పనులపై రోడ్లపైకి వచ్చినవారు ఇబ్బందిపడ్డారు. వాహన చోదకులు ఉదయం ఎనిమిది గంటల వరకూ లైట్లు వేసుకుని నడపాల్సి వచ్చింది. మంచు ప్రభావంతో ఎయిర్‌పోర్టు రన్‌వేపై విజిబిలిటీ ఉదయం 6.30 నుంచి 8.30 గంటల మధ్య 500 మీటర్లకు, వాల్తేరు తుఫాన్ హెచ్చరిక కేంద్రం వద్ద 700 మీటర్లకు పడిపోయింది. శివారు ప్రాంతాల్లో 100 మీటర్ల కంటే తక్కువకు విజిబిలిటీ పడిపోయిందని వాతావరణ



టౌన్‌కొత్తరోడ్డు వద్ద మంచు

... మిగతా 6వ పేజీలో

వైసీపీలో కలకలం

పార్టీ విశాఖ జిల్లా ఇన్‌చార్జిగా ఉన్న విజయసాయిరెడ్డి రాజీనామా ప్రకటనతో నేతలు, కార్యకర్తల్లో విస్మయం

- వైసీపీ అధికారంలో ఉన్నంతకాలం ఆయనదే పెత్తనం
- ఆరోపణలు అనేకం



విజయ సాయిరెడ్డి

విశాఖపట్నం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): రాజ్యసభ సభ్యుడు విజయ సాయిరెడ్డి రాజీనామా ప్రకటన వైసీపీని కుదిపేస్తోంది. పార్టీలో నంబరు-2గా వ్యవహరిస్తూ ఢిల్లీలో చక్రం తిప్పిన సాయిరెడ్డి రాజకీయాలకు గుడ్‌బై చెబుతున్నానని శుక్రవారం చేసిన ప్రకటన రాజకీయ వర్గాల్లో తీవ్రచర్చకు దారితీసింది. నిజంగా రాజీనామానా?, లేక తెర వెనుక ఏమైనా డ్రామా ఉందా?... అని పలువురు సంశయం వ్యక్తంచేస్తున్నారు.

కాకినాడ పోర్టు లావాదేవీల్లో విజయసాయి రెడ్డి వియ్యంకుడి కంపెనీ అయిన అరబిందో ఫార్మా పీకల్లోతు కష్టాల్లో కూరుకుపోవడం, అది అటు తిరిగి..ఇటు తిరిగి పార్టీ అధినేత జగన్మోహన్‌రెడ్డి మెడకు చుట్టుకునే అవకాశం ఉండడంతో ఏకంగా పార్టీ నుంచి బయటకు

... మిగతా 6వ పేజీలో

వైసీపీకి బొడ్డేటి కాశీ రాజీనామా



బొడ్డేటి కాశీ

విశాఖపట్నం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసినట్టు ఆ పార్టీ బీసీ విభాగం ప్రధాన కార్యదర్శి బొడ్డేటి కాశీ విశ్వనాథం (కాశీ) శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజ్యసభకు, పార్టీకి రాజీనామా చేస్తున్నానని విజయసాయిరెడ్డి ట్వీట్ చేసిన కొద్ది గంటలకే కాశీ ఈ ప్రకటన చేయడం గమనార్హం. కాశీ ప్రజారాజ్యం పార్టీ నుంచి గంటా శ్రీనివాసరావు ప్రధాన అనుచరుడిగా ఉండేవారు. బీచ్‌రోడ్డులో గోకార్టింగ్ ట్రాక్ ఉండేది. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత సాయిరెడ్డి ప్రతిపక్ష పార్టీ నాయకులను ఆర్థికంగా దెబ్బతీయడానికి యత్నించారు. ఈ క్రమం లో కాశీ గోకార్టింగ్‌ను నేలమట్టం చేశారు. దాంతో కాశీ తన వ్యాపార అవసరాల కోసం వైసీపీలో చేరిపోయారు. ఇప్పుడు సాయిరెడ్డి రాజీనామా చేయడంతో ఆయన కూడా రాజీనామా చేసేశారు.

భూముల కోసం

ఐటీ కంపెనీల అన్వేషణ

నగర శివారుల్లో 500 ఎకరాలు సేకరించే పనిలో జిల్లా అధికారులు

- సముద్ర తీరానికి 40 కిలోమీటర్లలోపు 80 ఎకరాలు కోరుతున్న గూగుల్
- డేటా సెంటర్ ఏర్పాటు చేయనున్నట్టు ఇప్పటికే సంస్థ ప్రకటన
- 30 ఎకరాల్లో టీసీఎస్ క్యాంపస్
- తాత్కాలికంగా మిలీనియం టవర్స్‌లో కార్యకలాపాలు
- ఐదారు నెలల్లో ప్రారంభించే అవకాశం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖపట్నంలో తమ కార్యకలాపాలు ప్రారంభించేందుకు దిగ్గజ ఐటీ సంస్థలు సిద్ధమవుతున్నాయి. అందుకు తగిన భూముల కోసం అన్వేషిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పాటైనప్పటిటి నుంచి విశాఖపట్నం రావడానికి ఐటీ కంపెనీలు ఆసక్తి చూపుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వ సూచనల మేరకు జిల్లా అధికారులు నగర శివారుల్లో సుమారు 500 ఎకరాలు గుర్తించే పనిలో ఉన్నారు. అవసరమైతే ఆ భూములకు సమీపంలోని డీపట్టా భూములు, జిరాయితీ భూములు సేకరించే అవకాశాలను పరిశీలిస్తున్నారు.

గూగుల్, టీసీఎస్ సంస్థలు తమకు అనువైన భూములు గుర్తించే పనిలో ఉన్నాయి. రెండు నెలల క్రితం ఇరు సంస్థల ప్రతినిధులు జిల్లా యంత్రాంగాన్ని కలిసి భూమి కేటాయిస్తే సొంతంగా భవనాలు ర్మించుకుంటామని సూత్రప్రాయంగా వెల్లడించారు. ఆ రెండు సంస్థలకు అవసరమైన భూములు గుర్తించే పనిలో అధికారులు నిమగ్నమై ఉన్నారు. డేటా సెంటర్‌ల ఏర్పాటుకోసం సముద్ర తీరానికి 40 నుంచి 50 కిలోమీటర్లలోపు 80 ఎకరాలు కావాలని జిల్లా యంత్రాంగాన్ని గూగుల్ కోరింది. అయితే ఒకేచోట కాకుండా మూడుచోట్ల భూమి తీసుకుని డేటా కేంద్రాలు ఏర్పాటుచేయనున్నది. ఈ సంస్థ కోసం రెండు, మూడుచోట్ల ప్రభుత్వ భూములు, కొండవాలు ప్రాంతాలను అధికారులు గుర్తించారు. తమకు 30 ఎకరాలు అవసరమవుతుందని టీసీఎస్ కంపెనీ ప్రతినిధులు చెప్పారు. ఈలోగా రుషికొండలో ఖాళీగా ఉన్న మిలీనియం టవర్లలో కార్యకలాపాలు ప్రారంభించేందుకు టీసీఎస్ సన్నాహాలు చేసుకుంటోంది. రానున్న ఐదారు నెలల్లో టీసీఎస్ తొలిదశ కార్యకలాపాలు ప్రారంభించేందుకు సిద్ధమవుతున్నట్టు సమాచారం. ఐదేళ్లలో పది వేల మంది ఉద్యోగులతో టీసీఎస్ విశాఖ క్యాంపస్‌ను విస్తరించనున్నది. గూగుల్ సంస్థ సంస్థ కూడా ఈ ఏడాది చివరికల్లా సొంతంగా నిర్మాణాలు చేపట్టే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఐటీ సంస్థలకు ప్రభుత్వం ఉచితంగా భూములు కేటాయించదని, నిర్ణీత ధరలకు విక్రయిస్తుందని, అయితే ఆయా ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పన మాత్రం ఏపీఐఐసీ లేదా పరిశ్రమల శాఖ చూస్తాయని ఒక అధికారి తెలిపారు. టీసీఎస్, గూగుల్ సంస్థలు కార్యకలాపాలు ప్రారంభించిన వెంటనే పలు చిన్న, మధ్య స్థాయి ఐటీ కంపెనీలు వస్తాయని, నగరంలో అన్ని రంగాల్లోనూ యాక్టివిటీ పెరుగుతుందన్నారు.



మిలీనియం టవర్స్

క్రూయిజ్ షిప్ వచ్చేస్తుంది

పోర్టు ప్రకటన

- ఆగస్టు 4-22 తేదీల మధ్య నడపనున్నట్టు వెల్లడి
- పుదుచ్చేరి నుంచి చెన్నై మీదుగా విశాఖకు రాక
- గతంలో పలుమార్లు ప్రకటనలకే పరిమితం
- ఏడాదిన్నర కిందట సిద్ధమైన టెర్మినల్



పోర్టు నిర్మించిన క్రూయిజ్ టెర్మినల్ భవనం



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖపట్నం పోర్టు క్రూయిజ్ టెర్మినల్ మళ్లీ కూత పెడుతోంది. క్రూయిజ్ షిప్‌లు వస్తాయని ప్రచారం చేస్తోంది. ఆగస్టు 4-22 తేదీల మధ్య మూడుసార్లు క్రూయిజ్ షిప్‌ను నడిపేందుకు సన్నాహాలు చేస్తున్నట్టు పోర్టు యాజమాన్యం శుక్రవారం ప్రకటించింది. ఈ నౌక (పేరు ప్రకటించకపోవడం గమనార్హం) పుదుచ్చేరి-చెన్నై-విశాఖపట్నం మధ్య నడుస్తుందని తెలిపింది.

క్రూయిజ్ టెర్మినల్ నిర్మించిన తరువాత ఇలాంటి ప్రకటనలు చేయడం పోర్టుకు పరిపాటిగా మారింది. గతంలో సింగపూర్ క్రూయిజ్ షిప్ వస్తుందని, ముంబై మేరీటైమ్ సదస్సులో ఒప్పందం చేసుకున్నామని అధికారులు ప్రకటించారు. కానీ అది అడ్రస్ లేదు. వాస్తవానికి టెర్మినల్ నిర్మించక ముందే (2022లో) విశాఖలోని పర్యాటక సంస్థలు కార్డిలియో క్రూయిజ్ షిప్పింగ్ యాజమాన్యంతో మాట్లాడి పుదుచ్చేరి-చైన్నై-విశాఖపట్నం మధ్య ఎంప్రెస్ నౌకను నడిపించారు. ఇప్పుడూ అదేమార్గంలో నడుపుతామని పోర్టు యాజమాన్యం చెబుతున్నా ఏ షిప్ వస్తుందనే విషయం వెల్లడించలేదు.

టెర్మినల్ ప్రారంభించి 16 నెలలు పూర్తి

పోర్టు అధికారుల కథనం ప్రకారం క్రూయిజ్ టెర్మినల్ భవనాన్ని 3,530 చ.మీ. విస్తీర్ణంలో నిర్మించారు. అందులో గ్రౌండ్ ఫ్లోర్ 2,750 చ.మీ. విస్తీర్ణంలో ఉండగా, దానిని ప్రయాణికుల రాకపోకలకు ఉద్దేశించారు. ఈ టెర్మినల్‌ను ఆనుకొని 180 మీటర్ల పొడవైన బెర్త్ ఉంది. నాలుగు మూరింగ్ డాల్ఫిన్లతో కలిపి బెర్తు పొడవు 330 మీటర్ల వరకు

... మిగతా 6వ పేజీలో

ఫ్రీ హోల్డ్ భూములపై విజిలెన్స్

పెందుర్తి తహసీల్దార్ కార్యాలయంలో తనిఖీలు



తహసీల్దార్ కార్యాలయంలో ఫ్రీహోల్డ్ భూముల దస్త్రాలను తనిఖీ చేస్తున్న విజిలెన్స్ డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ రేవతి పైలా

పెందుర్తి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో అసైన్డ్ భూములకు శాశ్వత హక్కులు (ఫ్రీ హోల్డ్) కల్పించడంలో అక్రమాలు చోటుచేసుకున్నట్టు వచ్చిన ఆరోపణలపై కూటమి ప్రభుత్వం దృష్టిసారించింది. ఈ క్రమంలో శుక్రవారం పెందుర్తి తహసీల్దార్ కార్యాలయంలో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ రేవతి తనిఖీలు చేశారు. పెందుర్తి రెవెన్యూ పరిధిలో శాశ్వత హక్కులు (ఫ్రీహోల్డ్) జారీ అయిన భూముల దస్త్రాలను పరిశీలించారు. మండలంలోని జెర్రిపోతులపాలెం, నరవ, చింతగట్ల, ఎస్.ఆర్.పురం గ్రామాల్లో 18 మంది పేరిట సుమారు ఇరవై ఎకరాలకు ఫ్రీహోల్డ్ పత్రాలు జారీ అయినట్టు ఆమె గుర్తించారు. అనుమతులు పొందిన భూములపై విచారణ చేపట్టనున్నట్టు తెలిసింది. అప్పటి ప్రభుత్వంలోని

... మిగతా 6వ పేజీలో

పక్కాగా క్యాన్సర్ స్క్రీనింగ్

- పద్దెనిమిదేళ్లు నిండిన వారందరికీ పరీక్షలు
- జిల్లాలో 17,77,440 మంది
- ఇప్పటివరకూ 2,61,670 మందికి స్క్రీనింగ్
- 2,120 మందికి అనుమానిత లక్షణాలు
- అందులో 600 మందికి రెండో దశ పరీక్షలు
- కేజీహెచ్‌కు 20 మంది...
- నాన్ కమ్యూనికేబుల్ వ్యాధుల వివరాలు కూడా సేకరణ
- బీపీతో 25,700 మంది, షుగర్‌తో 19,290 మంది బాధపడుతున్నట్టు గుర్తింపు



స్క్రీనింగ్ ప్రోగ్రామ్‌లో పాల్గొంటున్న ఆరోగ్య శాఖ సిబ్బంది, పర్యవేక్షిస్తున్న ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

గడిచిన కొన్నాళ్లుగా క్యాన్సర్ బారిన పడుతున్న వారి సంఖ్య పెరుగుతోంది. బాధితుల్లో దాదాపు మూడొంతుల మంది రెండు, మూడు దశలు దాటిన తరువాత గానీ గుర్తించలేకపోతున్నారు. దీంతో కొన్ని సందర్భాల్లో మెరుగైన వైద్యం అందించినప్పటికీ ప్రాణాలను కాపాడలేని పరిస్థితి ఏర్పడుతోంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమిక దశలోనే క్యాన్సర్‌ను గుర్తించే ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. స్క్రీనింగ్ ప్రోగ్రామ్‌ను రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభించింది. గత ఏడాది నవంబరులో ఈ ప్రోగ్రామ్ ప్రారంభం కాగా...ఈ ఏడాది ఆగస్టు వరకు కొనసాగ నున్నది. పద్దెనిమిదేళ్లు దాటిన ప్రతి ఒక్కరికీ క్యాన్సర్ స్క్రీనింగ్ చేయనున్నారు. జిల్లాలో పరీక్షించాల్సిన జనాభా 17,77,440 మందిగా అధికారులు గుర్తించారు. ఇప్పటివరకూ 2,61, 670 మందికి స్క్రీనింగ్ (13 శాతం) పూర్తయి నట్టు అధికారులు చెబుతున్నారు.

అనుమానిత కేసులు గుర్తింపు

ఏఎన్‌ఎంలు, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్లు ఇంటింటికీ వెళ్లి ఈ క్యాన్సర్ స్క్రీనింగ్

... మిగతా 6వ పేజీలో

ఏబీవీపీ రాష్ట్ర మహా సభలు ప్రారంభం



ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో శుక్రవారం అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) 43వ రాష్ట్ర మహాసభల్లో ప్రసంగిస్తున్న జాతీయ ప్రధాన కార్యదర్శి వీరేంద్రసింగ్ సోలంకి. చిత్రంలో భారత మాజీ క్రికెటర్ అంబటి తిరుపతి రాయుడు, మాజీ ఎమ్మెల్సీ మాధవ్, స్వాగత కమిటీ అధ్యక్షుడు కలిదిండి రఘు ఉన్నారు.

- వార్త మెయిన్ 12లో

మరో హనీ ట్రాప్ కేసు

- పోలీసుల అదుపులో మహిళ, నలుగురు పురుషులు.. పరారీలో మరో ఇద్దరు
- బాధితుడు శ్రీకాకుళం జిల్లా వాసి



భీమునిపట్నం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): విశాఖ నగరంలో మరో హనీ ట్రాప్ కేసు వెలుగుచూసింది. ఈ వ్యవహారంలో బాధితుడు శ్రీకాకుళం జిల్లావాసి. ఈ కేసులో ఓ వివాహితతో పాటు, సహకరించిన నలుగురిని శుక్రవారం సాయంత్రం పోలీసులు అదుపులోకి తీసుకున్నారని, మరో ఇద్దరు పరారీలో ఉన్నారని తెలిసింది. విశ్వసనీయ సమాచారం మేరకు...

నగరంలోని కంచరపాలేనికి చెందిన వివాహిత (34), విజయనగరం కొత్త అగ్రహారానికి చెందిన డోలా లక్ష్మణ్, ఇంటి సురేష్, బంగారు చక్రధర్, నగరంలోని ఉషోదయ జంక్షన్‌కు చెందిన ములపర్తి వెంకటేష్, పెదవాల్తేరుకు చెందిన మరో ఇద్దరు ముఠాగా ఏర్పడ్డారు. వీరంతా ఆమె ద్వారా పలువురికి ఫోన్లు చేయించి ముగ్గులోకి దింపేవారు. ఈ విధంగా ఈనెల 18న శ్రీకాకుళం జిల్లా పాతపట్నానికి చెందిన వెల్డర్ ఒకరికి ఫోన్ చేసి, మాయమాటలతో వడగొట్టారు. తాను 19న విశాఖ వస్తానని, కలుద్దామని ఆయన చెప్పారు. దీంతో ఆరోజు ఆమె ఫోన్ చేసింది. అయితే

... మిగతా 6వ పేజీలో



కల్యాణం చేస్తున్న అర్చకులు

నేత్రపర్వంగా అప్పన్న నిత్య కల్యాణం

సింహాచలం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : అప్పన్న స్వామి ఆర్జిత నిత్య కల్యాణం శుక్రవారం నేత్రపర్వంగా సాగింది.వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు.ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్టంపజేశారు.భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు.అనంతరం శాస్త్ర విధానంలో కల్యాణ క్రతువు జరిపారు. స్వామివారికి మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, ప్రసాదాలు అందజేశారు.

ఇటలీ పర్యాటకుల సందడి



రాజగోపురం వద్ద ఇటలీ పర్యాటకులు

సింహాచలం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : సింహగిరిపై ఇటలీ దేశానికి చెందిన పర్యాటకులు శుక్రవారం సందడి చేశారు. సాధారణ భక్తులతో పాటు క్యూలో వెళ్లి స్వామివారిని దర్శించుకున్నారు. గోదాదేవి దర్శనం తరువాత నుదుట కుంకుమ బొట్టు పెట్టుకున్నారు. ఉచిత ప్రసాదాన్ని స్వీకరించి, సింహగిరి విశిష్టత గురించి గైడ్‌లను అడిగి తెలుసుకున్నారు.

అక్రమ నిర్మాణాలు తొలగింపు

ఆనందపురం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వెల్లంకి గ్రామంలో అక్రమ నిర్మాణాలను రెవెన్యూ అధికారులు శుక్రవారం తొలగించారు. గత వైసీపీ ప్రభుత్వం స్థానికంగా ఉన్న 15 మందికి ఇళ్ల స్థలాలు కేటాయించింది. ఎనిమిది మంది ఇళ్లు నిర్మించుకోగా మిగతా ఏడుగురు పేర్ల మీద స్థానిక వైసీపీ నాయకులు వేరే వారి దగ్గర రూ. 14 లక్షలు తీసుకుని ల్యాండ్ పొజిషన్ సర్టిఫికెట్లు ఇచ్చారు. కూటమి నాయకులు అధికారులకు ఫిర్యాదు చేయడంతో తహసీల్దార్ ఆదేశాల మేరకు వీఆర్‌ఓ రామకృష్ణ అక్రమ నిర్మాణాలు కూల్చివేశారు. ఫోర్జరీ సంతకాలతో ఎల్‌ఓసీలు ఇచ్చిన వారిపై చర్యలు తీసుకుంటామని అధికారులు చెప్పారు.

సాగర దుర్గమ్మకు పూజలు

పద్మనాభం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : మద్ది గ్రామంలో ఉన్న సాగర దుర్గ ఆలయంలో అమ్మవారికి శుక్రవారం ప్రత్యేక పూజలు, కుంకుమార్చన నిర్వహించారు. అర్చకుడు సామవేదం సీతారామం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్టీ బుగత సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

బయో మెడికల్ రంగంలో అపార అవకాశాలు

సాగర్‌నగర్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : బయో మెడికల్ ఉత్పత్తుల రంగంలో ఇంజనీరింగ్ విద్యార్థులకు ఉజ్వల భవిత ఉందని, ముఖ్యంగా మెకానికల్ ఇంజనీరింగ్ విద్యార్థులు సరికొత్త ఆలోచనలతో ఈ రంగంలో అవకాశాలను అందుకోవాలని ఐఐటీ చెన్నై బయోమెడికల్ ఇంజనీరింగ్ ప్రొఫెసర్ బీఎస్ ప్రసాద్ పట్నాయక్ అన్నారు. గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం బయో మెడికల్ ఇంజనీరింగ్ - భారత్‌లో అవకాశాలు అన్న అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య రంగానికి అవసరమైన పరికరాలు దేశీయంగా ఉత్పత్తి చేయకపోవడంతో చాలాఏళ్లు విదేశాల నుంచి దిగుమతి చేసుకోవలసి వచ్చిందన్నారు. హృద్రోగులకు ఉపయోగించే కృత్రిమ కవాటాలు, ఇతర బయో మెడికల్ ఉత్పత్తులను అధిక వ్యయంతో కొనుగోలు చేయడాన్ని నివారించడానికి మెడ్‌టెక్ జోన్ ద్వారా దేశీయంగా పరిశోధన, అభివృద్ధిపై దృష్టిసారించిందని తెలిపారు. కార్యక్రమంలో గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరెక్టర్ కె. నాగేంద్రప్రసాద్, స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ అసోసియేట్ డీన్ డాక్టర్ కామేశ్వరరావు, రాజేశ్వరరెడ్డి, పాల్గొన్నారు.

కుళ్లిన మాంసం విక్రయిస్తున్న దుకాణదారులకు జరిమానా

విశాలాక్షినగర్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 9వ వార్డులోని మాంసం దుకాణాలను శానిటరీ ఇన్‌స్పెక్టర్ చిన్నాజీ ఆధ్వర్యంలో శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాడైన మాంసాన్ని గుర్తించి, స్వాధీనం చేసుకుని దుకాణదారులకు రూ. 3 వేల జరిమానా విధించారు.

భార్య, కుమార్తెల అదృశ్యంపై ఫిర్యాదు

ఎండాడ, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : తన భార్య, ఇద్దరు కుమార్తెలు కనిపించడం లేదని కొమ్మాది శివశక్తినగర్‌కు చెందిన పారాడి కృపానిధి శుక్రవారం పీఎంపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కార్పెంటర్ పనికి తాను అనకాపల్లి వెళ్లానని మధ్యాహ్నం వీడియో కాల్‌లో భార్య పిల్లలతో మాట్లాడినట్టు చెప్పారు. సాయంత్రం ఇంటికి రాగా వారు కనిపించడం లేదని తెలిపారు.





రెడ్డిపల్లిలో గోతులమయంగా ఉన్న రోడ్డు, దుమ్ము ధూళితో ఉన్న రహదారి

అసంపూర్తిగా రోడ్డు విస్తరణ

- పద్మనాభం - రెడ్డిపల్లి రహదారి దుస్థితి
- నాలుగేళ్లుగా పూర్తికాని నిర్మాణం
- రాకపోకలకు ప్రయాణికుల అవస్థలు
- వర్షం పడితే మరింత నరకయాతన

పద్మనాభం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పద్మనాభం - రెడ్డిపల్లి రోడ్డు విస్తరణ పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉన్నాయి. నాలుగేళ్లు అయినా పనులు పూర్తికాకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా వర్షం పడితే నరకయాతన అనుభవిస్తున్నారు. నాలుగేళ్ల క్రితం ఈ రోడ్డు విస్తరణ పనులకు శ్రీకారం చుట్టారు. కొంతవరకూ పనులు చేపట్టిన తరువాత ఆర్‌అండ్‌బీ శాఖాధికారులు తమకేమీ పట్టనట్టు వదిలేశారు. దీంతో ప్రజలు ఇటీవల రోడ్డు మీదుకు వచ్చి ధర్నా చేశారు. పనులు మొదలు పెట్టే వరకూ వాహనాలను రానివ్వమని భీష్మించుకు కూర్చున్నారు. పోలీసులు ఎంత చెప్పినా.. వినకుండా రోడ్డుపై బైఠాయింపు నుంచి లేవలేదు. ఎట్టకేలకు పోలీసులు ఆర్ అండ్‌బీ శాఖాధికారులతో మాట్లాడించి ఈనెల 20 నుంచి పనులను ప్రారంభిస్తామని స్పష్టమైన హామీ ఇవ్వడంతో రాస్తారోకో విరమించారు. స్థానికులు అధికారులకు ఇచ్చిన గడువు ముగిసినా, ఇప్పటికీ పనులు ప్రారంభం కాలేదు. ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు చెరువులా దర్శనమిస్తున్న ఈ రోడ్డుపై ప్రయాణించిన తరువాత కూడా దీని దుస్థితి మారలేదు. ఈ రోడ్డులో ప్రయాణించి నిత్యం అనేక మంది ప్రమాదాల బారిన పడుతున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక గుంతలు లేని రోడ్లను తీర్చిదిద్దండని చెప్పినా, అధికారులకు ఆ మాటలు చెవికి ఎక్కినట్టు లేవని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రజలు ఏమైపోతే మాకేమిటి అన్న రీతిలో అధికారులు, పాలకులు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా స్పందించి రోడ్డు విస్తరణ పనులు చేపట్టి, ఇబ్బందులు తొలగించాలని పలువురు కోరుతున్నారు.



మధురవాడ సమీపంలో కమ్ముకున్న పొగమంచు



భీమిలిని కమ్మేసిన పొగమంచు, చిన్నబజారు జంక్షన్‌లో ఎన్టీఆర్ విగ్రహం వద్ద మంచు



దట్టంగా పొగమంచు

భీమునిపట్నం/మధురవాడ, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : భీమిలి, మధురవాడ పరిసర ప్రాంతాల్లో శుక్రవారం పొగమంచు దట్టంగా కురిసింది. వేకువజామున పడిన మంచు ధాటికి పక్కపక్కనున్న మనుషులు కూడా కనిపించని పరిస్థితి నెలకొంది. భీమిలి పట్టణంలోని బీచ్‌రోడ్, దొరతోట రోడ్, తగరపువలస రోడ్ పూర్తిగా మంచుతో నిండిపోయాయి. ఉదయం 9 గంటల వరకూ మంచు తెరలు తొలగకపోవడంతో వాహనదారులు లైట్లు వేసుకుని రాకపోకలు సాగించారు. రహదారి కనిపించక కొందరు డ్రైవర్లు వాహనాలను రోడ్డు పక్కన నిలిపివేశారు. ప్రమాదాలు జరగకుండా ట్రాఫిక్ పోలీసులు వాహనదారులను అప్రమత్తం చేశారు. మంచుతో పాటు చల్లటి గాలులు వీయడంతో వృద్ధులు, విద్యార్థులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

రాష్ట్రస్థాయి రంగోత్సవ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

భీమునిపట్నం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి రంగోత్సవ్ పోటీల్లో జిల్లాకు చెందిన విద్యార్థులు ప్రతిభ చూపారని డైట్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం. జ్యోతి కుమారి తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల 7న డైట్‌లో జిల్లాస్థాయి రంగోత్సవ్ పోటీలు జరిగాయని, వాటిలో పలువురు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారన్నారు. డిజిటల్ కొలేజీ కేటగిరీలో పడుపూరు హైస్కూల్‌కు చెందిన ఎస్. చరణ్‌రాజ్ ద్వితీయ స్థానం, రంగోలి కేటగిరీలో భీమిలి కేజీబీవీకి చెందిన కె. ఉమాదేవి, కె. జ్యోత్స్న ద్వితీయ స్థానం, స్లోగన్ రైటింగ్‌లో పద్మనాభం కేజీబీవీ బాలి కలు కె. సుప్రియ ద్వితీయ స్థానం, రోల్ ప్లే కేటగిరీలో ఆరిపాక హైస్కూల్ విద్యార్థులు ఎ.ఉమాదేవి, జె.దివ్య, ధరణి, టి. ఇందువర్ధిని ద్వితీయ స్థానం పొందారని తెలిపారు.విజేతలను ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, డైట్ కళాశాలల అధ్యాపకులు అభినందించారు.

నేడు జాతీయ ఓటర్ల దినోత్సవం

పద్మనాభం రూరల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లోనూ శనివారం జాతీయ ఓటర్ల దినోత్సవం ఘనంగా నిర్వహించాలని తహసీల్దార్ కె. ఆనందరావు ఆదేశించారు. శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. బీఎల్‌ఓలు తమ పరిధిలో ఉన్న సీనియర్ సిటిజన్లను సన్మానించడంతో పాటు కొత్తగా ఓటు హక్కు పొందిన వారికి గుర్తింపు కార్డులు అందించాలన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ

పద్మనాభం రూరల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని జనసేన పార్టీ మండల అధ్యక్షుడు కె. రామస్వామినాయుడు అన్నారు. శుక్రవారం ఆయన గంధవరం గ్రామంలో సీసీ రహదారి నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకుడు బంగారునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

కృష్ణాపురంలో పశు వైద్య శిబిరం

పద్మనాభం రూరల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : పాడి పశువుల సంరక్షణ పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల పశు వైద్యాధికారి కె. మహేశ్ కుమార్ సూచించారు. శుక్రవారం ఆయన కృష్ణాపురంలో ఏర్పాటు చేసిన పశు వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పద్మనాభం వీఏసీఎస్ ఉపాధ్యక్షుడు మొకర అప్పలనాయుడు, బి. శ్రీను. ఎం. శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

నగరంపై మంచు దుప్పటి

... 5వ పేజీ తరువాయి

నిపుణుడొకరు తెలిపారు. ఈ సీజన్‌లో పొగమంచు కురుస్తుందని, అయితే శుక్రవారం దాని తీవ్రత పెరిగిందన్నారు. ఇటువంటి సమయాల్లో వాహనాలు నడిపేవారు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రానున్న రెండు రోజుల్లో పొగమంచు ప్రభావం ఉంటుందన్నారు.

కాలుష్యంలో 'పూర్' కేటగిరీగా నమోదు

పొగమంచు ప్రభావంతో నగరంలో కాలుష్యం తీవ్రత పెరిగింది. శుక్రవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంపై ఉన్న యాంబియంట్ ఎయిర్ క్వాలిటీ మిషన్‌లో పీఎం-2.5 పూర్ కేటగిరీగా నమోదైంది. గడచిన నాలుగైదు రోజులుగా కురుస్తున్న మంచుకు ధూళి కణాలు పైకి పోకుండా భూమికి తక్కువ ఎత్తులోనే ఉండిపోవడంతో నగరంలో కాలుష్యం పెరిగిందని వాతావరణ నిపుణుడొకరు తెలిపారు. కాలుష్యం పెరిగిన నేపథ్యంలో పొగమంచు కురిసే సమయంలో ఆరుబయట తిరిగితే ఊపిరితిత్తుల సమస్య వస్తుందన్నారు. ఇంకా గొంతు నొప్పి, జలుబు చేసి జ్వరాల బారినపడతారని హెచ్చరించారు. ఆస్తమా, ఇస్నోఫీలియా వంటివి ఉన్నవారు మాస్క్‌లు ధరించాలని సూచించారు.

బాలికల రక్షణ, భద్రతకు పోలీసులు కృషి

ఎండాడ, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) :బాలికల రక్షణతో పాటు వారి హక్కుల కోసం కృషి చేస్తున్నామని మహిళా పోలీసు స్టేషన్ ఏసీపీ సీహెచ్ పెంటారావు అన్నారు. జీవీఎంసీ 8వ వార్డు ఎండాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జాతీయ బాలికా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోషల్ మీడియా పట్ల విద్యార్థినులు అప్రమత్తంగా ఉండాలని, ఏమైనా ఇబ్బందులుంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం వానపల్లి శైలజా, ఏఎస్‌ఐ వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

సోషల్ మీడియా పట్ల అప్రమత్తం

విశాలాక్షినగర్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : బాలికలు, మహిళలు సోషల్ మీడియా పట్ల అప్రమత్తంగా ఉండాలని సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ సీఐ కల్యాణి సూచించారు. జేసీఐ మహిళా విభాగం ఆధ్వర్యంలో బీవీకే పాఠశాలలో శుక్రవారం జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె బాలికల రక్షణ, హక్కులు, లింగ సమానత్వంపై మాట్లాడారు. అనంతరం విద్యార్థినులకు చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జేఎఫ్‌ఎం మహిళా విభాగం చైర్‌పర్సన్ కాళిక, జేసీఐ డైరెక్టర్ సాయిలక్ష్మీ, ఉపాధ్యక్షురాలు కొండాల లక్ష్మీ, బీవీకే పాఠ శాల ప్రిన్సిపాల్ కేవీడీ మాధురి పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన

విశాలాక్షినగర్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : ప్లాస్టిక్ వినియోగం వల్ల పర్యావరణానికి హాని జరుగుతుందని, ప్రజలు వాటిని నిషేధించాలని జోన్-2 కమిషనర్ ఫణిరామ్ కోరారు. శుక్రవారం ఆయన 9వ వార్డులోని కైలాసగిరి కూడలిలో దుకాణదారులకు సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగర ప్రజలు ప్లాస్టిక్ కవర్ల వినియోగాన్ని నిషేధించి, గుడ్డ సంచులను వాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ చిన్నాజీ, జీవీఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

గంభీరం రిజర్వాయర్‌లో పడి బీటెక్ విద్యార్థి మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

ఆనందపురం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గంభీరం రిజర్వాయర్‌లో పడి బీటెక్ విద్యార్థి మృతి చెందాడు. ఆనందపురం సీఐ చింతా వాసునాయుడు తెలిపిన వివరాలు ప్రకారం..విజయనగరం జిల్లా చీపురుపల్లి సమీపంలోని కందిపేట గ్రామానికి చెందిన మీసాల నాని (20) మధురవాడ సమీపంలో ఉన్న గాయత్రి ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ తృతీయ సంవత్సరం చదువుతున్నాడు. ప్రైవేట్ వసతి గృహంలో ఉంటున్న నాని శుక్రవారం తన స్నేహితులు ఐదుగురితో కలిసి గంభీరం రిజర్వాయర్‌కు వచ్చాడు. అందరూ ఈత కొట్టేందుకు రిజర్వాయర్‌లోకి దిగగా నాని ఒక్కసారిగా మునిగిపోవడంతో స్నేహితులు కాపాడండి అంటూ గట్టిగా కేకలు వేశారు. సమీపంలో ఉన్న స్థానికులు వచ్చి కాపాడే ప్రయత్నం చేయగా అప్పటికే మృతి చెందడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీఐ వాసునాయుడు, ఎస్‌ఐ సురేశ్ సిబ్బందితో కలిసి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడి స్నేహితులను వివరాలు అడిగి కుటుంబ సభ్యులకు విషయం తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమిలి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ చెప్పారు.

పక్కాగా క్యాన్సర్ స్ర్కీనింగ్

... 5వ పేజీ తరువాయి

నిర్వ హిస్తున్నారు. అనుమానిత కేసులు గుర్తిస్తే స్థానిక పీహెచ్‌సీ వైద్యులకు సమాచారాన్ని అందిస్తారు.సదరు వైద్యుడు మరోసారి స్ర్కీనింగ్ చేసి కేన్సర్ లక్షణాలుగా అనుమానిస్తే కేజీహెచ్‌కు రిఫర్ చేసి, తదుపరివైద్యం ప్రారంభమయ్యేలా చూస్తారు. జిల్లాలో ఇప్పటివరకూ 2,61,670 మందికి పరీక్షలు నిర్వహించారు. ఇందులో 720 మందికి నోటి క్యాన్సర్ లక్షణాలు, 670 మందికి రొమ్ము క్యాన్సర్ లక్షణాలు, 730 మందికి సర్వైకల్ క్యాన్సర్ అనుమానిత లక్షణాలు ఉన్నట్టు గుర్తించారు. ఆ 2,120 మందిలో 600 మందికి రెండో దశ పరీక్షలు నిర్వహించిన అనంతరం 20 మందిని కేజీహెచ్‌కురిఫర్ చేసినట్టు అధికారులు చెబుతున్నారు.

బీపీ, షుగర్ కేసులు భారీగా..

క్యాన్సర్‌తోపాటు ఇతర నాన్ కమ్యూనికబుల్ డిసీజ్‌లకు సంబంధించిన వివరాలను వైద్య సిబ్బంది సేకరిస్తున్నారు. ఇప్పటివరకూ పూర్తి చేసిన సర్వే ప్రకారం జిల్లాలో 25,700 మంది హైపర్ టెన్షన్, 19, 290 మంది షుగర్‌తో బాధపడుతున్నట్టు గుర్తించారు. ఈ కేసులు సంఖ్య భారీగా ఉంటోందని చెబుతున్నారు. ప్రతి నాలుగైదు ఇళ్లలో వీటిలో ఏదో ఒక కేసు ఉంటోందని, గతంతో పోలిస్తే షుగర్, బీపీ బారినపడుతున్న వారి సంఖ్య పెరుగుతోందని అధికారులు పేర్కొంటున్నారు.

పకడ్బందీగా స్ర్కీనింగ్ నిర్వహించాలని ఆదేశించాం

క్యాన్సర్‌ను ముందుగానే గుర్తించడం ద్వారా మెరుగైన వైద్య సేవలు అందించాలన్నది ప్రభుత్వ ఉద్దేశం. ఈ మేరకు క్షేత్ర స్థాయి సర్వే చేసే సిబ్బందికి తగిన సూచనలు చేశాం. ఏయే అంశాలను పరిగణనలోకి తీసుకోవాలనే విషయాలను తెలియ జేశాం. అనుమానిత లక్షణాలు ఉన్నట్టు గుర్తించిన వారికి ఇప్పటి వరకూ దానిపై కనీసం అవగాహన కూడా లేదని వెల్లడైంది. ఈ తరహా ఇబ్బందులను అధిగమించేందుకే ప్రభుత్వం ఈ స్ర్కీనింగ్ ప్రోగ్రామ్‌ను చేపట్టింది.

\- డాక్టర్ పి.జగదీశ్వరరావు, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి

నిరంతరం పర్యవేక్షిస్తున్నాం

క్యాన్సర్ స్ర్కీనింగ్‌ను పక్కాగా చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. దీంతో నిరంతరం స్ర్కీనింగ్‌ను పర్యవేక్షిస్తున్నాం. సిబ్బంది ఇంటింటికీ వెళ్లి వారికి కేటాయించిన జాబితాలోని వివరాలను సేకరించి అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. అనుమానిత లక్షణాలు ఉన్నట్టయితే స్థానిక మెడికల్ ఆఫీసర్‌కు వివరాలు తెలియజేస్తారు. మెడికల్ ఆఫీసర్ వారిని మరోసారి పరీక్షించి అవసరమైతే కేజీహెచ్‌కు రిఫర్ చేస్తారు. ఇక్కడ మిగిలిన పరీక్షలు పూర్తిచేసి వైద్య సేవలు అందించే ఏర్పాట్లు చేస్తున్నాం.

\- డాక్టర్ హారిక, ఆర్‌బీఎస్‌కే, ఎన్‌సీడీసీడీ ప్రోగ్రామ్ ఆఫీసర్



పరేడ్‌కు సాధన చేస్తున్న జవాన్లు

వాల్తేరు రైల్వేలో గణతంత్ర వేడుకలకు ఏర్పాట్లు

ఆర్పీఎఫ్ సైనికుల కవాతు సాధన

విశాఖపట్నం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): వాల్తేరు రైల్వేలో ఆదివారం జరిగే గణతంత్ర వేడుకలకు ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. రైల్వే ఫుట్‌బాల్, అథ్లెటిక్స్ గ్రౌండ్‌లో జరిగే ఈ వేడుకలకు సంబంధించి వాల్తేరు రైల్వే ఆర్పీఎఫ్ విభాగం మూడు రోజులుగా ఏర్పాట్లలో నిమగ్నమైంది. ఢిల్లీలోని ఎర్రకోట నమూనాలో ప్రత్యేకంగా తాత్కాలిక సెట్ ఏర్పాటు చేస్తున్నారు. అలాగే గణతంత్ర దినోత్సవంలో రైల్వే ప్రొటెక్షన్ ఫోర్సు (ఆర్పీఎఫ్) చేసే కవాతుపై అధికారుల పర్యవేక్షణలో నాలుగు రోజులుగా ఉదయం, సాయంత్రం సైనికులు ముమ్మర సాధన చేస్తున్నారు. ఆర్పీఎఫ్, రైల్వే సివిల్ సర్వీసు, స్కౌట్స్ అండ్ గైడ్స్ వలంటీర్లు కూడా పాల్గొంటున్నారు. వేడుకలలో వివిధ ప్రదర్శనలకు సంబంధించి మోటారు వాహన విన్యాసాలలో ఆర్పీఎఫ్ సిబ్బంది, కవాతు బ్యాండ్‌లో కేంద్రీయ విద్యాలయ విద్యార్థులు ముమ్మరంగా సాధన చేస్తున్నారు. అనివార్య కారణాల వలన ఈ ఏడాది ఆర్పీఎఫ్ డాగ్ స్క్వాడ్ ప్రదర్శన ఏర్పాటు చేయడంలేదని తెలిసింది.

క్రూయిజ్ షిప్ వచ్చేస్తుంది

... 5వ పేజీ తరువాయి

వస్తుంది. దీని వెడల్పు 376. మీటర్లు. డ్రాఫ్ట్ 8.1 మీటర్లు. దీంతో పెద్ద పెద్ద క్రూయిజ్ షిప్‌లను కూడా తీసుకురావచ్చు.

పార్కింగ్‌లో ఏడు బస్సులు, 70 కార్లు, 40 ద్విచక్ర వాహనాలు నిలుపుకొనేలా వసతి కల్పించారు. దీనిని కేంద్ర మంత్రి చేతులు మీదుగా 2023 సెప్టెంబరులో ప్రారంభించారు. 16 నెలలు పూర్తయింది. అప్పటి నుంచి బోణీ లేదు. ఒక్క క్రూయిజ్ షిప్ కూడా రాలేదు. పోర్టు అధికారులకు దానిని ఎలా నిర్వహించాలో తెలియకపోవడమే ప్రధాన కారణమని అంటున్నారు. జిల్లా పర్యాటక శాఖ అధికారులతో పలుమార్లు చర్చలు జరిపినా ఎటువంటి ఫలితం కనిపించలేదు. టూర్స్ అండ్ ట్రావెల్స్ ప్రతినిధులు కొందరు పలు సూచనలు చేయగా వాటిని పట్టించుకోలేదు. ఒక కమిటీని ఏర్పాటుచేసి, క్రూయిజ్ సంస్థల వద్దకు వెళ్లి, ఈ ప్రాంతం గురించి, పర్యాటక స్థలాల గురించి, టెర్మినల్ సౌకర్యం గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తే...కనీసం ఏడాది తరువాతైనా స్లాట్లు ఇస్తారని కొందరు సూచించగా అధికారులు పట్టించుకోలేదు. ఒకానొక సమయంలో పైనుంచి వచ్చిన ఒత్తిళ్లు తట్టుకోలేక టెర్మినల్ నిర్వహణ బాధ్యతలు ప్రైవేటుకు అప్పగించాలని కూడా చూశారు. పత్రికల్లో ప్రకటనలు ఇచ్చారు. అయితే ఎవరూ ముందుకురాలేదు. దాంతో పోర్టు యాజమాన్యమే క్రూయిజ్ షిప్‌లను తీసుకురావలసిన పరిస్థితి వచ్చింది. తాజాగా ఏపీటీడీసీ ఎండీ ఆమ్రపాలి విశాఖపట్నం వచ్చి సమావేశం నిర్వహించడంతో విశాఖపట్నం పోర్టు 'ఆగస్టులో క్రూయిజ్' అంటూ ప్రకటన విడుదల చేసింది.

వైసీపీలో కలకలం

... 5వ పేజీ తరువాయి

వచ్చేశారని ప్రచారం జరుగుతోంది.

విశాఖలో ఆయన చెప్పిందే వేదం

వైసీపీ అధికారంలోకి రాక ముందే విజయసాయిరెడ్డి ఉత్తరాంధ్ర పార్టీ బాధ్యతలు తలకెత్తుకున్నారు. పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత విశాఖలో ఆయన చెప్పిందే వేదం అన్నట్టుగా సాగింది. మంత్రులు ఉన్నా వారికి ఎటువంటి విలువ దక్కలేదు. విశాఖలో జగన్ ఆదేశాలను తు.చ. తప్పకుండా అమలు చేశారు. ప్రతిపక్ష పార్టీ నాయకుల ఆస్తులను ధ్వంసం చేసి, కేసులు పెట్టి వేధించారు. దసపల్లా భూములను ప్రభుత్వ జాబితా నుంచి తప్పించారు. విశాఖ-భోగాపురం కోస్టల్ కారిడార్‌ను దారిమళ్లించారు. భీమిలి ప్రాంతంలో యజమానుల ఇష్టాఇష్టాలతో సంబంధం లేకుండా భూములను కొనుక్కున్నారు. సింహాచలం దేవస్థానం చైర్మన్ అశోక్‌గజపతిరాజును పక్కనపెట్టి ఆయన సోదరుడు ఆనందగజపతి కుమార్తె సంచయితను ఢిల్లీ నుంచి తీసుకువచ్చి చైర్‌పర్సన్‌ను చేసి ఆ కుటుంబంలో చిచ్చు పెట్టారు. చాలామందిని భయపెట్టి పార్టీ మారేలా చేశారు. 2024 ఎన్నికలకు ఏడాది ముందు సాయిరెడ్డిని ఇక్కడి నుంచి తప్పించి వైవీ సుబ్బారెడ్డిని ఇన్‌చార్జిగా వేశారు. పార్టీ ఓడిపోవడంతో సాయిరెడ్డికి జగన్ మళ్లీ విశాఖ జిల్లా పార్టీ బాధ్యతలు అప్పగించారు. ఈ మధ్య రెండు, మూడుసార్లు నగరానికి వచ్చి పార్టీ సమావేశాలు నిర్వహించారు. ఆయనతో నాటి ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, ఆడిటర్ జీవీ వంటి వారికి పొసిగేది కాదు. ఇరు వర్గాల మధ్య పచ్చగడ్డి వస్తే భగ్గుమనేది. ఇదిలావుండగా పార్టీ నుంచి నేతలు ఒక్కొక్కరు బయటకు వెళ్లిపోతుండడంతో నాయకులు, కార్యకర్తలు కలవరపడుతున్నారు. ఇటీవల మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు, పశ్చిమ ఇన్‌చార్జి ఆడారి ఆనందకుమార్‌లు పార్టీకి రాజీనామా చేసిన విషయం తెలిసిందే.

ఫ్రీ హోల్డ్ భూములపై విజిలెన్స్

... 5వ పేజీ తరువాయి

కొంతమంది పెద్దలు రైతులతో ముందస్తు ఒప్పందం చేసుకుని, ఆ తరువాత తమ పలుకుబడిని ఉపయోగించి ఫ్రీహోల్డ్ అనుమతులు పొందారనే ఆరోపణలు వచ్చాయి. రాష్ట్ర విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఓఎస్డీ కింజారపు ప్రభాకర్ ఆదేశాల మేరకు ఫ్రీహోల్డ్ భూములపై విజిలెన్స్ విచారణ చేపట్టామని డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ రేవతి తెలిపారు. దస్త్రాలు తనిఖీ చేసి నివేదికను ఉన్నతాధికారులకు సమర్పిస్తామన్నారు.

మరో హనీ ట్రాప్ కేసు

... 5వ పేజీ తరువాయి

తాను తన కుమార్తెను బోయిపాలెం వద్ద హాస్టల్‌లో దింపేసి వెళ్లిపోతున్నానని చెప్పడంతో, కలుద్దామనుకున్నాం కదా అలా ఎలా వెళ్లిపోతారని వివాహిత ప్రశ్నించింది. దీంతో ఆయన తగరపువలస సమీపంలోని సంగివలస మూడుగుళ్ల అమ్మవారి ఆలయం వద్ద ఆటో దిగిపోతానని, అక్కడ కలుద్దామని చెప్పడంతో సరేనంది. ఆయన అక్కడ దిగి నిరీక్షిస్తుండగా మూడు బైకులపై ఆరుగురు వ్యక్తులు వెళ్లి...తమ బంధువైన మహిళకు ఫోన్ చేసి అసభ్యంగా మాట్లాడుతున్నావంటూ బైక్‌పై బలవంతంగా ఎక్కించుకుని విజయనగరం వైపు తీసుకువెళ్లారు. రఘు కాలేజీ సమీపంలోని నిర్మానుష్య ప్రాంతంలో బైకులు ఆపి ఆయన్ను చితగ్గొట్టారు. జేబులో ఉన్న రూ.50 వేలు, ఏటీఎం కార్డులు తీసుకున్నారు. సెల్‌ఫోన్ నుంచి రూ.8,900 తమకు ట్రాన్స్‌ఫర్ చేసుకున్నారు. ఈ విషయం ఎవరితోనైనా చెబితే చంపేస్తామని బెదిరించి, అతడిని అక్కడే వదిలేసి సెల్‌ఫోన్ లాక్కుని వెళ్లిపోయారు. ఆయన షర్టు జేబులో మిగిలిన రూ.500తో ఇంటికి వెళ్లిపోయాడు. ముఖం కమిలిపోయి, వంటినిండా దెబ్బలు ఉండడంతో కుటుంబసభ్యులు ప్రశ్నించారు. జరిగిన విషయాన్ని వివరించాడు. ఈనెల 22న భీమిలి చేరుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో విశాఖ నార్త్ క్రైమ్ సీఐ బీఎస్ఎన్ ప్రకాశ్ పర్యవేక్షణలో భీమిలి ఎస్‌ఐ సూర్యప్రకాశరావు, ఆరు బృందాలు నిందితుల సెల్‌ఫోన్ కాల్‌లిస్ట్, సీసీ కెమెరాల ఫుటేజిని పరిశీలించారు. చాకచక్యంగా నిందితులను పట్టుకుని వారి నుంచి మూడు బైకులు, కొంత నగదు స్వాధీనం చేసుకున్నారని తెలిసింది. ఐదుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నామని, పూర్తి వివరాలు ఉన్నతాధికారులు నగరంలో మీడియాకు తెలియజేస్తారని, కేసు దర్యాప్తులో ఉందని భీమిలి ఎస్‌ఐ సూర్యప్రకాశరావు తెలిపారు. నగరంలో రెండు నెలల క్రితం ఓ హనీ ట్రాప్ కేసు వెలుగుచూసిన విషయం తెలిసిందే.

కొండప్ప చెరువు పరిశుభ్రతకు దివీస్ అంగీకారం

తగరపువలస, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : సంగివలస కొండప్ప చెరువును శుభ్రపరిచేందుకు చిప్పాడ దివీస్ కంపెనీ ముందుకు వచ్చింది. శుక్రవారం చెరువు వద్ద జడ్పీ ప్రేమ ప్రసన్నవాణి సంబంధిత పత్రాలను కంపెనీ సీఎస్ఆర్ మేనేజర్ సురేశ్‌కుమార్‌కు అందించారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

భీమునిపట్నం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) :పీఎస్ఎం హైస్కూల్‌ను భోజన పథకం జిల్లా కోఆర్డినేటర్ శాస్త్రి శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన భోజన పథకానికి సంబంధించిన రికార్డులు పరిశీలించారు.

పరిశ్రమల స్థాపనకు సంపూర్ణ సహకారం: కలెక్టర్

మహారాణిపేట, జనవరి 24(ఆంధ్రజ్యోతి): జిల్లా పారిశ్రామికంగా అభివృద్ధి చెందేలా అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించి ఔత్సాహికులకు సంపూర్ణ సహకారం అందించాలని కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జరిగిన జిల్లా పారిశ్రామిక ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశంలో పలు అంశాలను చర్చించారు. అధికారులకు అన్నిరకాల సాంకేతిక అంశాలపై అవగాహన ఉండాలని, పరిశ్రమల స్థాపనకు ముందుకు వచ్చేవారికి సహకరించాలని సూచించారు. ఈ సందర్భంగా గతంలో అజెండాలో తీసుకున్న అంశాలపై చర్యలను జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ వి.ఆదిశేషు వివరించారు. కార్యక్రమంలో ఆర్‌డీవో పి.శ్రీలేఖ, ఐలా ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు, ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

క్రీడాకారునికి ఎమ్మెల్యే అభినందన



వెంకటరమనను సన్మానిస్తున్న ఎమ్మెల్యే

ఎంవీపీ కాలనీ, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : విశాఖ జిల్లా నుంచి అండర్-14 క్రికెట్‌కు ఎంపికైన విద్యార్థిని ఎమ్మెల్యే కార్యాలయంలో శుక్రవారం శాసనసభ్యుడు వెలగపూడి రామకృష్ణబాబు అభినందించారు. ఇటీవల ఒంగోలులో జరిగిన క్రికెట్ టీంఎంపికలో ఎనిమిదో తరగతి చదువుతున్న ఎనుముల వెంకటరమణ ఎంపికయ్యాడు. ఉత్తరప్రదేశ్‌లోని ఆగ్రాలో ఈ నెల 28 నుంచి జరగనున్న క్రికెట్ పోటీల్లో వెంకటరమణ ఆడనున్నాడు.

ప్రకటనలే.. చర్యలు శూన్యం

మద్దిలపాలెం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : గ్రీన్‌బెల్ట్ ఆక్రమణలపై చర్యలు తీసుకోవాల్సిన జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు సమాధానాలతో సరిపెడుతున్నారు. ఇసుకతోట నుంచి ఆటోమోటివ్ వచ్చే జాతీయరహదారి గ్రీన్‌బెల్ట్‌లో తొలగించిన చోటే మళ్లీ వ్యాపారాలు నిర్వహిస్తుంటే చోద్యం చూస్తున్నారు. శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'లో 'గ్రీన్ బెల్ట్‌లో మళ్లీ కార్ల వ్యాపారం మొదలు' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనికి చర్యలు తీసుకోవాల్సిన టౌన్‌ప్లానింగ్ అధికారులు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. గతంలో ఇక్కడ వ్యాపారాలు తొలిగించామని, గ్రీన్‌బెల్ట్ చుట్టూ కంచె ఏర్పాటు చేయడానికి ఇంజినీరింగ్ విభాగానికి లేఖ రాశామని ప్రకటనలో పేర్కొన్నారు. అంతేకాని ఆక్రమణలకు పాల్పడిన వారిపై చర్యలు చేపట్టడం లేదు. మళ్లీ వ్యాపారాలు చేస్తున్న తొలగొంచే ప్రయత్నం చేయకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

సినిమా గైడ్

● **సంక్రాంతికి వస్తున్నాం :** శ్రీలీలామహల్, శారద, శ్రీరామ, మెలోడి, జగదాంబ, సంగం, కామేశ్వరి, కిన్నెర, గోకుల్, కాంతి, శ్రీలక్ష్మీనరసింహ-1,2 (104 ఏరియా), శ్రీనరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య, మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), తాతా, రాములమ్మ (తగరపువలస)

● **డాకు మహారాజ్ :** జగదాంబ, శ్రీవెంకటేశ్వర, శరత్, శ్రీకన్య, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య, సౌజన్య (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్, శ్రీకన్య హెవెన్ (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), గణేష్, సప్తగిరి (తగరపువలస),

● **గేమ్ ఛేంజర్ :** మెలోడి, సంగం, రమాదేవి, వెంకటేశ్వర, కామేశ్వరి, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), కన్యకాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-2 (పెందుర్తి) రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 35, టమాటా 14, వంకాయలు (తెలుపు)28, వంకాయలు (నలుపు) 36, బెండకాయలు 46, పచ్చిమిర్చి 40, కాకరకాయలు 46, బీరకాయలు 52, ఆనపకాయ 16, కాలీఫ్లవర్ 20, క్యాబేజి 14, క్యారెట్ 28 దొండకాయలు 42, బంగాళ దుంపలు 26, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 110, అల్లం (పాతది)46, బరబాటి 42, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 65, బద్దచిక్కుడు 24, దోస కాయలు 32, వెల్లుల్లి (పెద్దవి) 290, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 44, పొటల్స్ 80, కీర దోస 34, కాప్సికమ్ 44, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 48, చిలగడ దుంపలు 40, కంద 56, దేముడు చిక్కుడు 40, గోరు చిక్కుడు 30, ఆగాకార దేశవాలి 100 , ఆగాకర హైబ్రిడ్ 50, కూర పెండలం 26, బ్రకోలి 80 , నూల్‌కోల్ 34, పనసపొట్టు 200, కొండఉసిరి 70, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 25, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 150, బూడిద గుమ్మడికాయ 30, కర్ర పెండలం 20, మామిడి అల్లం 46, బొప్పాయి 35, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	485
విజయనగరం	489
శ్రీకాకుళం	489

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	120
లైవ్ ధర	140
విత్ స్కిన్	250
స్కిన్‌లెస్	260

చిన్నారుల కోసం బాల ఆధార్ డ్రైవ్

» 0-6 వయసు వారి కోసం ప్రత్యేకంగా ఆధార్ కేంద్రాలు
» జోన్-3లో 5 సచివాలయాల్లో ఏర్పాటు
» ఈ నెలాఖరు వరకు అవకాశం



చిన్నారికి ఆధార్ నమోదు చేస్తున్న సిబ్బంది

మద్దిలపాలెం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : చిన్నారులకు పుట్టినప్పటి నుంచే కొన్ని సంక్షేమ పథకాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తోంది. ఈ పథకాలు పొందాలంటే జీరో వయసు పిల్లలకు ఆధార్ కార్డు తప్పనిసరి. అందుకే రాష్ట్ర ప్రభుత్వం చిన్నారులకు ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో జీవీఎంసీ జోన్-3లో బాల ఆధార్ డ్రైవ్ పేరుతో చిన్నారులకు ఆధార్ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ డ్రైవ్‌లో జీరో నుంచి ఆరేళ్లలోపు చిన్నారులకు ఆధార్ నమోదు చేస్తున్నారు. నెలాఖరు వరకు బాలాధార్ డ్రైవ్ చేపట్టనున్నారు. ఇందుకోసం జోన్-3 పరిధిలో ఐదు సచివాలయాల్లో ఆధార్ నమోదు కేంద్రాలు ఏర్పాటు చేశారు. న్యూవెంకోజీపాలెం-2, మద్దిలపాలెం-3, లలితానగర్, పాతరేసపువానిపాలెం, దొండపర్తి-2 సచివాలయాల్లో బాలాధర్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. అంతేకాకుండా ప్రస్తుతం ఆధార్ సేవలు అందిస్తున్న కేంద్రాల్లో కూడా బాలాధర్ డ్రైవ్ చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు బ్యాంక్, పోస్టాఫీస్‌లలో ఉన్న ఆధార్ కేంద్రాల్లో కూడా చిన్నారుల ఆధార్ నమోదు నిర్వహిస్తున్నారు. ఈ నమోదుకు ఎలాంటి రుసుం చెల్లించనవసరం లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది.

పథకాలకు ఆధార్ తప్పనిసరి

చిన్నారులకు ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలకు ఆధార్ నంబర్ తప్పనిసరి. ముఖ్యంగా పుట్టిన పిల్లలకు జీరో వయసు నుంచి మూడేళ్ల వరకు అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలామృతం, కోడి గుడ్లు, పాలు, బెల్లం వేరుశనగ చిక్కీ, సోడిపిండి అందిస్తున్నారు. అంగన్వవాడీ కేంద్రాల్లో పిల్లలకు ప్రతీ నెలా సుమారు రూ.వెయ్యి విలువ చేసే పౌష్టికాహారం పంపిణీ చేస్తున్నారు. ప్రభుత్వం అందించే పౌష్టికాహారం కావాలంటే పుట్టిన పిల్లలకు సైతం ఆధార్ నంబర్ తప్పనిసరి ఉండాల్సిందే. అంగన్‌వాడీ సెంటర్‌లో చిన్నారుల ఆధార్ నంబర్‌తో నమోదు చేస్తేనే వారికి పౌష్టికాహారం పంపిణీ జరుగుతోంది. ఆధార్ నంబర్ లేకపోతే చిన్నారి నమోదు జరగదు. అంతేకాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి పిల్లలకు వచ్చే అనేక పథకాలకు ఆధార్ నంబర్ తప్పనిసరి కావడంతో పుట్టిన పిల్లలకు ఆధార్ నమోదు చేయాల్సిన అవసరం ఉంది.

ఆధార్ నమోదకు ఇవీ తప్పనిసరి

- క్యూఆర్ కోడ్‌తో ఉన్న చిన్నారుల పుట్టినతేదీ (డేట్ ఆఫ్ బర్త్) ధ్రువపత్రం
- దరఖాస్తు ఫారం
- తల్లి లేదా తండ్రి తమ బిడ్డను తీసుకుని ఆధార్ కేంద్రానికి వెళ్లాలి
- బిడ్డను ఆధార్ కేంద్రానికి తీసుకుని వెళ్లే తల్లి లేదా తండ్రి ఆధార్‌కార్డు.

23వ వార్డులో రూ.39 లక్షలతో యూజీడీ పనులు



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి, కార్పొరేటర్ విజయసాయి

మద్దిలపాలెం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 23వ వార్డులో రూ.39 లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు స్థానిక ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డులో యూజీడీ లైన్లు రిపేర్లకు గురి కావడంతో కొత్తలైన్ల వేయడానికి జీవీఎంసీ నిధులు కేటాయించిందన్నారు. అలాగే వార్డు అభివృద్ధికి పలు కార్యక్రమాలు చేపట్టామన్నారు. స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారానికి ఎప్పుడూ ముందుంటానన్నారు. మౌలిక వసతుల కల్పనలో కూటమి ప్రభుత్వం వెనకాడదన్నారు. కార్పొరేటర్ గుడ్ల విజయసాయి మాట్లాడుతూ వార్డులో పారిశుధ్య నిర్వహణ మెరుగుపరచడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. రోడ్లు, అండర్ డ్రైనేజీ సమస్యలు పరిష్కరిస్తున్నామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గుడ్ల సత్యారెడ్డి, గొలగాని పురుషోత్తం, అచ్చి రమేష్‌రెడ్డి, బూన రాంబాబు, గాలి అప్పలరెడ్డి, కాకి వేణుబాయ్, ఎర్రయ్యరెడ్డి, చల్ల నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

వీఎంఆర్డీఏ బాలల థియేటర్ ఫుడ్ కోర్టులో ఆకస్మిక తనిఖీలు



ఫుడ్‌కోర్టులో తనిఖీ చేస్తున్న వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్

సిరిపురం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : సిరిపురంలోని వీఎంఆర్డీఏ బాలల థియేటర్‌లోని ఫుడ్‌కోర్టులో శుక్రవారం వీఎంఆర్డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్‌గోపాల్, జాయింట్ కమిషనర్ కె.రమేష్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఫుడ్‌కోర్టు నిర్వహణపై నగర ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు ఆకస్మిక తనిఖీ చేపట్టారు. ఆ సమయంలో ఫుడ్‌కోర్టులో ఎటువంటి తినుబండారాలు లేకపోగా, ఒక ప్రైవేట్ కార్యాలయం నిర్వహిస్తున్నట్టు గుర్తించారు. ఫుడ్‌కోర్టులో ఆహార పదార్థాలు, ఇతర తినుబండారాలు లేకపోవడం, కార్యాలయ నిర్వహణను చూసి ఆశ్చర్యపోయారు. బాలల థియేటర్‌కు వచ్చిన వారికి అవసరమైన ఆహార పదార్థాలు, ఉత్పత్తులు అందుబాటులో ఉంచాలని నాణ్యత విషయంలో రాజీ పడవద్దని స్పష్టం చేశారు. ప్రైవేట్ కార్యాలయాన్ని వెంటనే తొలగించాలని ఆదేశించారు. వీఎంఆర్డీఏ నిర్దేశించిన విధంగా వ్యాపార కార్యకలాపాలు నిర్వహించాలని ఆదేశించారు. అనంతరం ఫుడ్‌కోర్టు నిర్వాహకుడుకు నోటీసులు జారీ చేశారు.

బాల్య స్మృతులను గుర్తుచేసుకున్న నితీష్



నితీష్‌కుమార్‌రెడ్డి సన్మానిస్తున్న సునంద్

అక్కయ్యపాలెం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : పీఈటీల సంఘం అధ్యక్షుడు, క్రికెట్ కోచ్ ఎ.సునంద్‌ను జాతీయ క్రికెటర్ నితీష్ కుమార్ రెడ్డి శుక్రవారం ఎన్‌జీజీఓస్ కాలనీలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నితీష్‌రెడ్డిని సునంద్ శాలువా కప్పి సత్కరించారు. విశాఖలో జరిగిన తన చిన్ననాటి జ్ఞాపకాలను నితీష్‌రెడ్డి గుర్తు చేసుకున్నారు. 2014-15లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆంధ్రప్రదేశ్ తరపున విశాఖపట్నం నుంచి నెల్లూరులో జరిగిన జాతీయ క్రికెట్ పోటీల్లో పాల్గొన్నారు. అదే సంవత్సరం తెలంగాణ రాష్ట్రం మహబూబ్‌నగర్ జిల్లాలో జరిగిన క్రికెట్ పోటీల్లో ఆడారు. ఆ క్రికెట్ టీమ్‌లకు సునంద్ కోచ్‌గా వ్యవహరించారు. ఈ సందర్భంగా సునంద్ మాట్లాడుతూ 2013లోనే నితీష్‌రెడ్డి ఆట చూసి ఎప్పటికైనా భారత్ జట్టు తరపున ఆడుతారనుకున్నానని చెప్పారు. గోవా, కర్ణాటక తదితర రాష్ట్రాలతో క్రికెట్ ఆడి ఎక్కువ స్కోర్ చేశారన్నారు. నితీష్ చిన్నప్పటి నుంచి మంచి ఆటగాడన్నారు. ఆస్ట్రేలియాలో సెంచరీ చేయడం చాలా ఆనందంగా ఉందన్నారు. నితీష్ ఆంధ్రప్రదేశ్‌లో పుట్టడం అందరికీ గర్వకారణమన్నారు. విశాఖ నుంచి ఇండియా తరపున ఆడుతున్న ఆటగాళ్లందరికీ సునంద్ అభినందనలు తెలిపారు.

తోపుడు బండ్ల వ్యాపారులకు ఊరట

» స్టేటస్ కో ఆర్డర్ ఇచ్చిన రెంటల్ కంట్రోల్ కోర్టు
» కేసు తేలే వరకూ వ్యాపారాలు చేసుకోవచ్చంటూ ఆదేశం

మద్దిలపాలెం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 22వ వార్డు కళాభారతి తోడుపు బండ్ల వ్యాపారులకు జిల్లా కోర్టులో ఊరట లభించింది. కళాభారతి రోడ్డులో వ్యాపారాలు తొలగించడం వల్ల జీవనోపాధి పోయిందని కోర్టుకెక్కిన చిరు వ్యాపారులకు శుక్రవారం రెంటల్ కంట్రోల్ కోర్టు (ఆర్‌సీసీ) ఫోర్త్ ఏడీఎం స్టేటస్ కో ఇచ్చారు. 22వ వార్డులో వీధివ్యాపారాలు తొలగించాలని స్థానిక కార్పొరేటర్ పీతల మూర్తి హైకోర్టులో ప్రజావాజ్యం దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఆయన పిల్‌పై జీవీఎంసీ అధికారులకు కౌంటర్ దాఖాలు చేయక పోవడంతో 2014 స్ట్రీట్ వెండర్స్ యాక్ట్‌కు లోబడి రోడ్డు మార్జిన దాటిన ఆక్రమణలు తొలగించాలని హైకోర్టు ఆదేశాలు జారీచేసింది. దీంతో కిందటి ఏడాది నవంబర్ 16న జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు వార్డులోని తోపుడు బండ్ల దుకాణాలు మొత్తం తొలగించారు. దీనిపై బాధితులు ఆర్‌సీసీ కోర్టులో కేసు వేశారు. ముప్పై ఏళ్లుగా ఇక్కడే వీధి వ్యాపారాలు చేస్తున్నామని, కేవలం కక్ష సాధింపులకే కార్పొరేటర్ హైకోర్టులో పిల్ దాఖాలు చేశారని, హైకోర్టు మార్జిన్ దాటిన ఆక్రమణలు తొలగించమంటే మార్జిన్‌లోనే ఉన్న మా దుకాణాలను ధ్వంసం చేసి ఒక్కొక్కరికి రూ.లక్ష నష్టం కలిగించారని కోర్టును ఆశ్రయించారు. దీనిపై కోర్టు జీవీఎంసీ అధికారులు, వీధివ్యాపారుల వాదనలు విని స్టేటస్ కో ఆర్డర్ ఇచ్చింది. సోమవారం నుంచి గతంలో ఏ విధంగా ఉన్నాయో అదే విధంగా వ్యాపారాలు చేసుకోవాలని పేర్కొంది. కోర్టులో కేసు తేలే వరకు చిరువర్తకుల జోలికి వెళ్లవద్దని జీవీఎంసీ, పోలీస్ అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. దీంతో రెండు నెలలుగా వ్యాపారాలు లేక రోడ్డునపడ్డ చిరువ్యాపారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

దావోస్ వెళ్తే.. దారి ఖర్చులు కూడా రాలేదు

» మాజీ మంత్రి అంబటి రాంబాబు



విమానాశ్రయం నుంచి బయటకు వస్తున్న అంబటి రాంబాబు

గోపాలపట్నం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకువస్తామని దావోస్ సదస్సుకు వెళ్లిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బృందానికి దారి ఖర్చులు కూడా రాలేదని మాజీ మంత్రి అంబటి రాంబాబు ఎద్దేవా చేశారు. నగరంలో జరిగిన ఓ కార్యక్రమానికి హాజరైన ఆయన శుక్రవారం రాత్రి విమానాశ్రయంలో విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబుబృందం రాష్ట్రానికి ఎన్ని రూ. కోట్లు పెట్టుబడులు తీసుకువచ్చారు, అక్కడికి వెళ్లడానికి ఎన్ని కోట్లు ఖర్చు చేశారో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. సింగడు అద్దంకి వెళ్లొచ్చాడన్న సామెతలా చంద్రబాబు దావోస్ పర్యటన ఉందని విమర్శించారు. విశాఖను ఎవరు అభివృద్ధి చేసినా, చేయకపోయినా సొంతంగా వృద్ధి చెందేలా ఇక్కడ సహజ వనరులు ఉన్నాయని, అమరావతిని ఎంత అభివృద్ధి చేయాలని ప్రయత్నించినా అభివృద్ధి చెందే అవకాశం లేదని పేర్కొన్నారు.

చిన్నారుల అదృశ్యంపై ముమ్మర దర్యాప్తు

ఎంవీపీ కాలనీ, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : ఎంవీపీ స్టేషన్ పరిధిలో ఇద్దరు బాలురు అదృశ్యం అయిన కేసులో పోలీసులు చురుగ్గా దర్యాప్తు చేస్తున్నారు. అయితే ఇప్పటి వరకూ వారికి బాలల ఆచూకీ తెలియలేదు. నక్కవానిపాలెం క్రాంతినగర్‌కు చెందిన 13 ఏళ్ల బాలుడు చాట్ల ధీరజ్, చైతన్యనగర్‌కు చెందిన 14 ఏళ్ల బాలుడు దత్తి యశ్వంత్ రెండు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదని పోలీసులకు తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. అప్రమత్తమైన పోలీసులు వెంటనే దర్యాప్తు ప్రారంభించినప్పటికీ రైలులో హైదరాబాదు చేరుకున్నట్లు మాత్రమే తెలుసుకున్నారు. వారి వద్ద ఒక సెల్ ఫోన్ ఉన్నప్పటికీ అది స్విచ్ ఆఫ్ అయి ఉంది. పిల్లల వద్ద రూ.20 వేలు ఉన్నట్లు సమాచారం. ఇప్పటికే ఒక కానిస్టేబుల్ హైదరాబాద్ చేరుకుని సీసీ ఫుటేజీలు పరిశీలించగా వారిద్దరు బాలురు ఒక ఆటోలో వెళ్లినట్లు తెలిసింది. ఆటో డ్రయివరును విచారించగా తనకు గుర్తులేదని చెప్పడంతో కేసు మొదటికి వచ్చింది. మరో కానిస్టేబుల్‌ను శుక్రవారం హైదరాబాద్ పంపించారు. ఎలాంటి ఆచూకీ లభించకపోవడంతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

ఎస్‌బీఐ ఆధ్వర్యంలో విద్యార్థినులకు సైకిళ్ల అందజేత



విద్యార్థులకు సైకిళ్లను అందజేస్తున్న ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ ఐ.బాలసుబ్రహ్మణ్యం

సిరిపురం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : జాతీయ బాలికా దినోత్సవం పురస్కరించుకుని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ బిజినెస్ కార్యాలయం విశాఖపట్నం సెంట్రల్ రీజియన్ ఆధ్వర్యంలో కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా శుక్రవారం ఈస్టుపాయింట్ కాలనీలోని జిల్లాపరిషత్ హైస్కూల్ (కేడీపీఎం) విద్యార్థులకు రూ.75 వేలు విలువైన 10 సైకిళ్లను అందించారు. కార్యక్రమంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ మేనేజర్ ఐ.బాలసుబ్రహ్మణ్యం, చీఫ్ మేనేజర్ కేవీవీ సత్యనారాయణ, ఎస్‌బీఐ మేనేజర్ రాజేష్‌కుమార్, కేడీపీఎం హెచ్‌ఎం ఎన్.సుమితిబాయి , పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి ఆటల పోటీలు ప్రారంభం

భీమునిపట్నం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): భీమిలి ప్రభుత్వ ఉన్నత పాఠశాల శతాబ్ది ఉత్సవాల నేపథ్యంలో ఈనెల 25 నుంచి ఆటల పోటీలు ప్రారంభించనున్నట్టు ఫిజికల్ డైరెక్టర్ సతీశ్ తెలిపారు. శతాబ్ది ఉత్సవ్ స్పోర్ట్ కమిటీ సభ్యులు తట్టికోట భీమారావు, అత్తిలి సత్యనారాయణ, దారపు అప్పారావు, మైలపల్లి లక్ష్మణరావు, యెచ్చర్ల హరి సహకారంతో ఈ పోటీలు నిర్వహిస్తామన్నారు. విద్యార్థులకు కబడ్డీ, వాలీబాల్, రన్నింగ్, క్యారమ్స్, చెస్ పోటీలు., విద్యార్థినులకు కబడ్డీ, రన్నింగ్, స్కిప్పింగ్, ఖోఖో పోటీలుంటాయన్నారు. శుక్రవారం సాయంత్రం సమగ్ర శిక్ష ఇంజనీరింగ్ అధికారులు పాఠశాల ఆవరణను పరిశీలించారన్నారు. ఉత్సవ్ ఏర్పాట్లపై కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ఆన్‌లైన్‌లో సమీక్షించినట్టు హెచ్‌ఎం పొన్నగంటి రమణ తెలిపారు.

ఖైదీలు పండించిన కూరగాయల విక్రయం



కూరగాయలు విక్రయిస్తున్న దృశ్యం

ఆరిలోవ, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : కేంద్రకారాగారంలో సాగు చేస్తున్న కూరగాయలను శుక్రవారం జైలు ప్రవేశ ద్వారం వద్ద విక్రయించారు. ఇక్కడ గల సుధార్ విక్రయ కేంద్రంలో కూరగాయలను ఉంచి అటుగా వెళ్లే వారికి సరసరమైన ధరలకు అమ్మారు. శుక్రవారం ఉదయం తోట నుంచి కాలీఫ్లవర్‌లను కోసి సుమారు వంద జైలులో వంటకు కేటాయించారు. సుమారు రెండు కిలోల బరువు గల కాలీఫ్లవర్‌ను రూ.30కి అమ్మారు. మిగిలిన కాలీఫ్లవర్లను విక్రయానికి పెట్టారు. సేంద్రీయ ఎరువులతో పండించడంతో జైలులో పండించిన కూరగాయలకు డిమాండ్ ఉంటుంది. అలాగే మార్కెట్ ధర కంటే కాస్త తక్కువకు అమ్మడంతో వీటని కొనేందుకు కొనుగోలుదారులు ఆసక్తి చూపారు. కాలీఫ్లవర్‌లతో పాటు సొరకాయలను విక్రయించారు.



యూహెచ్-3 హెచ్ యుద్ధ హెలికాప్టర్ మ్యూజియం నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ విశ్వనాథన్

పర్యాటక ప్రదేశాల్లో మౌలిక వసతులు తప్పనిసరి

వీఎంఆర్డీఏ కమిషనర్ విశ్వనాథన్

సిరిపురం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : వీఎంఆర్డీఏ పర్యాటక ప్రదేశాల్లోని మౌలిక సదుపాయాలు కల్పించాలని అధికారులకు వీఎంఆర్డీఏ కమిషనర్ కేఎస్ విశ్వనాథన్ స్పష్టం చేశారు. శుక్రవారం వీఎంఆర్డీఏ నిర్వహణలో ఉన్న పర్యాటక ప్రదేశాలైన వీఎంఆర్డీఏ పార్కు, టీయూ యుద్ధ విమాన మ్యూజియం, సీహ్యారియర్ మ్యూజియంల్లో ఆయన ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. పారిశుధ్యం, తాగునీరు నిర్వహించి ఆయా ప్రదేశాల్లో సందర్శకులకు మెరుగైన కనీస మౌలిక సదుపాయాలను కల్పించాలన్నారు. అసంపూర్తిగా ఉన్న పనులను సత్వరమే పూర్తి చేయాలని, మరమ్మతులకు గురైన విద్యుత్ దీపాలను మరమ్మతు చేసి పునరుద్ధరించాలని సూచించారు. అదనపు టాయ్‌లెట్లు కల్పించడం కోసం అంచనాలను రూపొందించాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. యూహెచ్-3హెచ్ యుద్ధ హెలికాప్టర్ మ్యూజియం నిర్మాణ పనులను ఈ నెల 30 నాటికి పూర్తి చేసి ప్రారంభోత్సవానికి అన్ని విధాలా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ పర్యటనలో చీఫ్ ఇంజనీర్ భవానీశంకర్, ఇంజనీర్లు ఎస్‌వీఎస్ఎన్ రాజు, రామరాజు, డీఎఫ్‌ఓ శివానీ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ జెండాలను వినియోగించొద్దు

» బాలవికాస్ ఫౌండేషన్ వ్యవస్థాపక కార్యదర్శి నరవ ప్రకాశరావు



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న నరవ ప్రకాశరావు, జగదేశ్వరరావు తదితరులు

ఎంవీపీ కాలనీ, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : మన జాతీయ పతాకాలను ప్లాస్టిక్ రూపంలో వినియోగించవద్దని బాలవికాస్ ఫౌండేషన్ వ్యవస్థాపక కార్యదర్శి నరవ ప్రకాశరావు కోరారు. ఎంవీపీ కాలనీలోని ఎస్‌వీవీపీ డిగ్రీ కళాశాల ఆవరణలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ప్లాస్టిక్ జెండాలను వినియోగించవద్దంటూ వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. ప్లాస్టిక్ వాడకం వల్ల అనేక అనర్థాలు ఉన్నాయని, కాబట్టి వస్త్ర జెండాలను మాత్రమే అన్ని కార్యక్రమాల్లోనూ వినియోగించాలని కోరారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జగదేశ్వరరావు, డాక్టర్ అప్పారావు, రాణి, ప్రియాంక, శైలజ, డాక్టర్ బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

కేబుల్ ఆపరేటర్లపై పెనాల్టీల రద్దు హర్షణీయం

సీమాంధ్ర కేబుల్ ఆపరేటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పోతన్నరెడ్డి

పెదవాల్తేరు జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : కేబుల్ ఆపరేటర్లపై గత ప్రభుత్వం వేసిన పెనాల్టీలను రద్దు చేస్తామని ప్రకటించడం పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి సీమాంధ్ర కేబుల్ ఆపరేటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బైరెడ్డి పోతన్నరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ జగన్ సర్కార్ ఆపరేటర్లపై వేసిన రూ.100 కోట్ల పెనాల్టీలను రద్దు చేస్తామని ఏపీ ఫైబర్‌నెట్ సంస్థ చైర్మన్ జీవీ రెడ్డి ప్రకటించారని ఒక ప్రకటనలోపేర్కొన్నారు. గత ప్రభుత్వం ఆపరేటర్లపై అక్రమంగా వేసిన పెనాల్టీను రద్దు చేసినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఏప్రిల్ నెల నుంచి సెట్ టాప్ బాక్స్‌లను కూడా ఇస్తామని ప్రకటించడాన్ని స్వాగతించామని, ఇది తమ కేబుల్ ఆపరేటర్లకు ఎంతగానో ప్రయోజనం చేకూరుతుందన్నారు. గత జగన్ ప్రభుత్వం సెట్ టాప్ బాక్స్ అద్దె కింద ఒక్కో కనెక్షన్‌కు రూ.59 వసూలు చేసిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్, ఏపీ ఫైబర్ నెట్ సంస్థ చైర్మన్ జీవీ రెడ్డికి సీమాంధ్ర కేబుల్ ఆపరేటర్స్ అసోసియేషన్ ధన్యవాదాలు తెలిపారు.

స్టీల్‌ప్లాంటుకు ప్యాకేజీ ప్రకటన ఓ బూటకం

» ఐఎన్‌టీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగభూషణం



దీక్షాశిబిరం వద్ద మాట్లాడుతున్న నాగభూషణం

సిరిపురం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : కేంద్రంలో అధికారంలోని ఉన్న ఎన్డీఏ ప్రభుత్వం విశాఖ ఉక్కు పరిశ్రమకు ప్యాకేజీ ప్రకటించడం ఒక బూటకమని ఐఎన్‌టీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగవిల్లి నాగభూషణం విమర్శించారు. శుక్రవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరణ వద్దంటూ కొనసాగుతున్న దీక్షల్లో ఐఎన్‌టీయూసీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాగభూషణం మాట్లాడుతూ కార్మికులు, ప్రజలను తప్పుదోవ పట్టించడానికి ఈ ప్రకటన చేశారని ఆరోపించారు. కార్మికులకు వీఆర్‌ఎస్ ప్రకటించడం, పని చేస్తున్న కార్మికులకు మూడు నెలల నుంచి జీతాలు ఇవ్వకపోవడం, పని చేస్తున్న 4 వేల మంది కాంట్రాక్టు కార్మికులను తగ్గించడం వంటివన్నీ ప్రైవేటీకరణ చేయడంలో భాగమేనన్నారు. ఉక్కు పరిశ్రమకు సొంత గనులు కేటాయించే వరకు తమ పోరాటం కొనసాగుతుందని తెలిపారు. ఈ దీక్షలో నాయకులు కె.ఈశ్వరరావు, ఐఎన్‌టీయూసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

» 18వ వార్డు కార్పొరేటర్ మంగవేణి



పారిశుధ్య కార్మికులకు నేత్ర వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

ఎంవీపీ కాలనీ, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : పారిశుధ్య కార్మికులు తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని 18వ వార్డు కార్పొరేటరు గొలగాని మంగవేణి అన్నారు. పారిశుధ్య కార్మికులకు నేత్ర వైద్య శిబిరాన్ని ఆమె వార్డు కార్యాలయం ఆవరణలో శుక్రవారం ప్రారంభించారు. నగరంలోని వాసన్ ఐ ఆసుపత్రి సిబ్బంది కార్మికులకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. పనిచేసే పరిస్థితుల వల్ల అనారోగ్యం బారిన పడే ప్రమాదం ఉంటుంది కాబట్టి ప్రతి ఒక్కరూ వైద్య పరీక్షలు చేయించుకోవాలని కార్పొరేటరు కార్మికులకు సూచించారు. కార్యకమంలో టీడీపీ వార్డు అధ్యక్షుడు పోలరావు పాల్గొన్నారు.

33వ వార్డులో జిమ్ ఏర్పాటు



జిమ్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ భరత్, చిత్రంలో గండి బాబ్జి, వసంతలక్ష్మి

అల్లిపురం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ ఎన్నికల సమయంలో 33వ వార్డులో కార్పొరేటర్ భీశెట్టి వసంతలక్ష్మి ఇచ్చిన హామీ మేరకు జనసేన నాయకులు భీశెట్టి గోపికృష్ణ ఏర్పాటు చేసిన ఉచిత జిమ్‌ను శుక్రవారం విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్, టీడీపీ పెందుర్తి ఇన్‌చార్జ్ గండిబాబ్జి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ వసంతలక్ష్మి మాట్లాడుతూ ప్రజలు వినియోగించేందుకు వీలుగా ఎంజీఎం పాఠశాల వద్ద జిమ్ ఏర్పాటుకు నాడు హామీ ఇచ్చి, నేడు కార్యరూపం దాల్చడం చాలా ఆనందంగా ఉందన్నారు. టూటౌన్ సీఐ తిరుమలరావు, జనసేన వార్డు అధ్యక్షుడు ఆకుల రాజు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

దేశభక్తి, అభ్యుదయ అంశాలపై చినవాల్తేరులో నేడు పోటీలు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అతిథులు

విశాఖపట్నం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): గణతంత్ర దినోత్సవం సందర్భంగా గురజాడ సాంస్కృతిక వేదిక, లిల్లీ వైట్స్ క్లబ్, అల్లూరి విజ్ఞాన కేంద్రం సంయుక్తంగా ఈ నెల 25న దేశభక్తి, అభ్యుదయ అంశాలపై పిల్లలకు పాటల పోటీలు నిర్వహించనున్నట్టు దండు నాగేశ్వరరావు తెలిపారు. చినవాల్తేరులోని లిల్లీ వైట్స్ క్లబ్ ఆవరణలో నిర్వహించే ఈ పోటీల్లో స్కూల్ పిల్లలకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. అభ్యుదయ అంశాలపై వ్యాస రచన పోటీలు ఉంటాయన్నారు. గెలుపొందిన చిన్నారులకు ఈనెల 26న జరిగే గణతంత్ర వేడుకలలో బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేస్తామని పేర్కొన్నారు. గణతంత్ర సంబరాలలో భాగంగా ఆదివారం లిల్లీ వైట్స్ క్లబ్ ఆవరణలో పలు కళా సంస్థలతో కోలాటం, రింగ్ డ్యాన్స్ నృత్య ప్రదర్శనలు ఉంటాయన్నారు. దీనికి సంబంధించి శుక్రవారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. పోటీల్లో పాల్గొనేందుకు ఆసక్తి గలవారు ఫోన్:94907 50661, 92912 24231 నందు సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

డీఆర్ఎం తనిఖీలు




అధికారులతో కలిసి విజయనగరం స్టేషన్‌ను పరిశీలిస్తున్న డీఆర్ఎం మనోజ్‌కుమార్ సాహు

విశాఖపట్నం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): విజయనగరం స్టేషన్‌లో డీఆర్ఎం మనోజ్‌కుమార్ సాహు శుక్రవారం తనిఖీలు చేపట్టారు. ముందుగా స్టేషన్‌లోని ప్రయాణికుల మౌలిక సదుపాయాల నిర్వహణను పరిశీలించారు. అలాగే అమృత భారత్ స్టేషన్ పథకం కింద చేపట్టిన భవనం, ప్రయాణకుల సౌకర్యాలు, సర్క్యులేటింగ్ ప్రాంతం, వాహనాల పార్కింగ్ ఏరియా, పార్శిల్ సేవలు అప్‌గ్రేడ్ చేయడం వంటి పనులను సమీక్షించారు. విజయనగరం, పలాస మధ్య మూడో లైను ప్రాజెక్టుకు సంబంధించి క్రూ రన్నింగ్ రూమ్, యార్డులోని సదుపాయాలపై అధికారులతో సమీక్షించారు. ఈ పర్యటనలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

అక్కయ్యపాలెం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): నిర్వహణ పనులు చేపడుతున్నందున శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఈఈ బి.సింహాచలం నాయుడు తెలిపారు. అక్కయ్యపాలెం ప్రధాన రహదారి, ఇండియన్ ఓవర్‌సిస్ బ్యాంక్ ఏరియా, పాత పోస్టాఫీసు రోడ్డు, మహరాణి పార్లర్, శ్రీనివాసనగర్ ప్రాంతాల్లో సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలన్నారు.

ఒడిశా మహిళకు ఆశ్రయం



గులాబీ రంగు చీరతో ఉన్న మహిళ

పూర్ణామార్కెట్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): రైల్వే స్టేషన్‌లో తలదాచుకుంటున్న మహిళకు వన్‌టౌన్ పరిధిలోని స్వామి వివేకానంద సేవా సంస్థ ఆశ్రయం కల్పించిందని అధ్యక్షుడు సూరాడ అప్పారావు తెలిపారు. ఒడిశాలోని బరంపురం పాత్రపురానికి చెందిన మహిళ విశాఖ రైల్వేస్టేషన్‌లో తలదాచుకుంటోందన్నారు. స్థానికులు ఈమె విషయమై నాలుగో పట్టణ పోలీసులకు సమాచారం ఇచ్చారన్నారు. నగర పోలీస్ కమిషనర్ డా.శంఖబ్రత బాగ్చి ఆదేశం మేరకు పోలీసులు ఆ మహిళను శుక్రవారం తమ సంస్థకు అప్పగించినట్లు వెల్లడించారు.

బాలికల ఉజ్వల భవిత లక్ష్యం: జిల్లా వైద్యాధికారి



బాలిక దినోత్సవ ర్యాలీని ప్రారంభిస్తున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు



మర్రిపాలెంలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న అంగన్వాడీ కార్యకర్తలు, ఐసీడీఎస్ అధికారిణులు



సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థినులు

సీతమ్మధార/మర్రిపాలెం/జ్ఞానాపురం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): బాలికల ఉజ్వల భవిత, సాధికారత లక్ష్యంగా ఈ ఏడాది కార్యక్రమాలు చేపట్టనున్నట్లు జిల్లా వైద్యాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు చెప్పారు. జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయం నుంచి చేపట్టిన ర్యాలీని జెండా ఊపి ఆయన ప్రారంభించారు. లింగ నిర్ధారణ పరీక్ష చట్ట రీత్యా నేరమన్నారు. అనంతరం మరో అధికారి బి.నాగేశ్వరరావు మాట్లాడుతూ స్త్రీ, పురుషులు సమానమని, ఈ నిష్పత్తి రాష్ట్రంలోనూ, విశాఖపట్నం జిల్లాలోనూ ఒకేలా (ప్రతి వెయ్యి మంది పురుషులకు 942మంది మహిళలు) ఉందన్నారు. బేటి బచావో, బేటీ పడావో నినాదంతో అందరూ పనిచేయాలని పిలుపునిచ్చారు. బాలికలు చదువుకుంటే తనతోపాటు కుటుంబం కూడా ప్రగతిపథంలో పయనిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రామ్ అధికారులు, కార్యాలయ సిబ్బంది, నర్సింగ్ విద్యార్థినులు పాల్గొన్నారు. మర్రిపాలెం ఆర్‌అండ్‌బీ జంక్షన్ వద్ద గల ఐసీడీఎస్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీఓ రమణకుమారి మాట్లాడుతూ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలే బాలికలకు ఇచ్చే నిజమైన గౌరవమన్నారు. అసమానత్వం, విద్య, వైద్య సంరక్షణ, చట్టపరమైన హక్కులు, బాల్య వివాహాల గురించి ప్రతి ఒక్కరూ అవగాహనతో ఉండాలన్నారు. అనంతరం పరిసర కాలనీల్లో ర్యాలీ నిర్వహించారు. సహాయక సీడీపీఓ శ్రీలత, సెక్టర్ సూపర్‌వైజర్లు జెఎన్‌టీ జ్యోతి, కుమారి, వరలక్ష్మీ, సైకాలజిస్టు పార్వతి కాశ్యప్, సహాయ మేనేజర్ సుజాత, అంగన్వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. జ్ఞానాపురంలోని సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్లు, వ్యాయామ విద్యా విభాగం ఆధ్వర్యంలో బాలికా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. 'ఆడపిల్లల సంరక్షణ అందరి బాధ్యత' అనే అంశంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి అతిథిగా డా.పి.కె.జయలక్ష్మి విచ్చేశారు. బాలికల సంరక్షణకు పలు సూచనలు చేశారు. అనంతరం కార్యక్రమాల అమలు అధికారిణి డా. కె.మాణిక్యకుమారి మాట్లాడుతూ బాలికల హక్కుల గురించి ప్రజల్లో అవగాహన పెంచడానికి కేంద్రం పెద్దపీట వేస్తోందన్నారు. ఈ సందర్భంగా బాలికలకు డాడ్జ్‌బాల్, ఆర్మ్ రెజ్లింగ్, టగ్ అఫ్ వార్ తదితర ఆటల పోటీలు నిర్వహించారు. ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ప్రవీణ్ బాబు, డాక్టర్ రమణిలత, డాకర్ రూపా సెల్వరాజ్, రాజేష్, ఆనంద్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ



చెక్కులు అందుకున్న బాధితులతో ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు తదితరులు

సీతమ్మధార, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): సీతమ్మధారలోని ఉత్తర నియోజకవర్గ బీజేపీ కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి (రిలీఫ్ ఫండ్) చెక్కులను పలువురికి ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు శుక్రవారం అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 44వ వార్డు నివాసి కల్పనకు రూ.69 వేలు, 14వ వార్డు పెనుమత్స్య జ్యోతికి రూ.81 వేలు, 25వ వార్డు టి.రాముకి రూ.40 వేలు, చంద్రరావు రూ.25 వేలు, ఎస్.సత్య లక్ష్మికి రూ.25 వేలు, కె.సురేష్‌కుమార్‌కి రూ.1.23 లక్షలు అందజేసినట్లు పేర్కొన్నారు. మరో 65 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, వారికి కూడా త్వరలో సహాయం అందజేస్తామన్నారు. ఆరోగ్యశ్రీ వర్తించని వారు ఎక్కడైనా చికిత్స పొంది, ఆ బిల్లులను తమ వద్దకు తీసుకువచ్చి దరఖాస్తు చేస్తే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి ఆర్థిక సహాయం అందేలా చేస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆయా వార్డుల అధ్యక్షులు నమ్మి రవికుమార్, నారా కిషోర్, నాయకులు పాల్గొన్నారు.

పరిశ్రమల స్థాపనకు సంపూర్ణ సహకారం: కలెక్టర్

మహారాణిపేట, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): జిల్లా పారిశ్రామికంగా అభివృద్ధి చెందేలా అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించి ఔత్సాహికులకు సంపూర్ణ సహకారం అందించాలని కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జరిగిన జిల్లా పారిశ్రామిక ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశంలో పలు అంశాలను చర్చించారు. అధికారులకు అన్నిరకాల సాంకేతిక అంశాలపై అవగాహన ఉండాలని, పరిశ్రమల స్థాపనకు ముందుకు వచ్చేవారికి సహకరించాలని సూచించారు. ఈ సందర్భంగా గతంలో అజెండాలో తీసుకున్న అంశాలపై చర్యలను జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ వి.ఆదిశేషు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో పి.శ్రీలేఖ, ఐలా ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు, ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

క్రీడలపై యువత ఆసక్తి పెంచుకోవాలి



టెన్నిస్ బాల్ క్రికెట్ విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

జగదాంబ కూడలి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): క్రీడలపై యువత ఆసక్తి పెంచుకోవాలని దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ సూచించారు. శుక్రవారం ఇందిరా మున్సిపల్ స్టేడియంలో శుక్రవారం టెన్నిస్ బాల్ క్రికెట్ లీగ్ మ్యాచ్ విజేతలకు బహుమతులు అందజేశారు. క్రీడల ద్వారా దేన్నైనా సాధించవచ్చన్నారు. ఇందిరా మున్సిపల్ స్టేడియంలో అన్ని రకాల క్రీడలకు వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటానన్నారు. టెన్నిస్ బాల్ క్రికెట్ లీగ్ మ్యాచ్‌లో ప్రతిభ చూపిన క్రీడాకారులను అభినందించారు. భవిష్యత్‌లో మరింత ఉత్సాహంగా ముందుకు వెళ్లాలని హితవు పలికారు. ప్రతీ క్రీడాకారుడికి పూర్తి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా టెన్నిస్ బాల్ క్రికెట్ లీగ్ మ్యాచ్ విజేతలైన హక్స్ ఎలెవెన్ జట్టుకు రూ.లక్ష, రన్నర్‌గా నిలిచిన సౌత్ స్ట్రైకర్స్‌కు రూ.60 వేలు, ట్రోఫీని ఆయన ద్వారా నిర్వాహకులు అందజేశారు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్, బెస్ట్ బౌలర్, బ్యాట్స్‌మెన్‌గా ఎంపికైన క్రీడాకారులకు ప్రత్యేక బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మహేష్, కూటమి నాయకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

క్విజ్ విజేతలకు బహుమతి ప్రదానం



క్విజ్ పోటీ నిర్వహిస్తున్న దృశ్యం

అక్కయ్యపాలెం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): అక్కయ్యపాలెంలోని ఎన్‌జీజీఓస్ కాలనీలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో పొట్టి శ్రీరాములు చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు పీఎంఎల్ నరసింహం ఆధ్వర్యంలో అమరజీవి జీవిత చరిత్రపై శుక్రవారం విద్యార్థినీ, విద్యార్థులకు క్విజ్ పోటీ నిర్వహించారు. ప్రధానోపాధ్యాయిని బి.లక్ష్మీనరస విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కిశోర్, ఎంవీ ధర్మారావు, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

బాల్య స్మృతులను గుర్తుచేసుకున్న నితీష్



నితీష్‌కుమార్‌రెడ్డిని సత్కరిస్తున్న సునంద్

అక్కయ్యపాలెం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): పీఈటీల సంఘం అధ్యక్షుడు, క్రికెట్ కోచ్ ఎ.సునంద్‌ను జాతీయ క్రికెటర్ నితీష్ కుమార్ రెడ్డి శుక్రవారం ఎన్‌జీజీఓస్ కాలనీలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నితీష్‌రెడ్డిని సునంద్ శాలువా కప్పి సత్కరించారు. విశాఖలో జరిగిన తన చిన్ననాటి జ్ఞాపకాలను నితీష్‌రెడ్డి గుర్తుచేసుకున్నారు. 2014-15లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆంధ్రప్రదేశ్ తరపున విశాఖపట్నం నుంచి నెల్లూరులో జరిగిన జాతీయ క్రికెట్ పోటీల్లో పాల్గొన్నారు. అదే సంవత్సరం తెలంగాణ రాష్ట్రం మహబూబ్‌నగర్ జిల్లాలో జరిగిన క్రికెట్ పోటీల్లో ఆడారు. ఆ క్రికెట్ టీమ్‌లకు సునంద్ కోచ్‌గా వ్యవహరించారు. ఈ సందర్భంగా సునంద్ మాట్లాడుతూ 2013లోనే నితీష్‌రెడ్డి ఆట చూసి ఎప్పటికైనా భారత్ జట్టు తరపున ఆడుతారనుకున్నానని చెప్పారు. గోవా, కర్నాటక తదితర రాష్ట్రాలతో క్రికెట్ ఆడి ఎక్కువ స్కోర్ చేశారన్నారు. నితీష్ చిన్నప్పటి నుంచి మంచి ఆటగాడన్నారు. ఆస్ట్రేలియాలో సెంచరీ చేయడం చాలా ఆనందంగా ఉందన్నారు.

ఘనంగా హజ్రత్ ఖాజా గరిబ్ నవాజ్ చందనోత్సవం



శాంతిర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

మర్రిపాలెం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): మర్రిపాలెం జాకీర్‌హుస్సేన్‌నగర్‌లో హజ్రత్ ఖాజా గరీబ్ నవాజ్ చందనోత్సవం మజీద్ ఈ అల్ ఖదీర్ కమిటీ అధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున మజీద్ ప్రాంగణంలో ముస్లింలు ఖురాన్ పఠించారు. మధ్యాహ్నం పవిత్ర నమాజును ఆచరించి సాయంత్రం ఛాదర్ (పవిత్ర వస్త్రం) ప్రదర్శించారు. చిన్నారులు నాతేకలంలు ఆలపిస్తూ మర్రిపాలెం పరిసర ప్రాంతాలలో శాంతి ర్యాలీ నిర్వహించారు. అనంతరం మర్రిపాలెం రైల్వే క్వార్టర్స్ వద్ద గల హజ్రత్ ఖాజా గరిబ్ నిషాని వద్ద జెండా ఆవిష్కరించారు. ముస్లిం కమిటీ అధ్వర్యంలో దావత్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కమిటీ అధ్యక్షుడు మున్నా, ఉర్ఫ్ కమిటీ అధ్యక్షుడు మహ్మద్ గౌస్, అలీబాబు తదితరులు పర్యవేక్షించారు.

గంభీరం రిజర్వాయర్‌లో పడి బీటెక్ విద్యార్థి మృతి

ఆనందపురం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): గంభీరం రిజర్వాయర్‌లో పడి బీటెక్ విద్యార్థి మృతిచెందాడు. ఆనందపురం సీఐ చింతా వాసునాయుడు తెలిపిన వివరాల ప్రకారం.. విజయనగరం జిల్లా చీపురుపల్లి సమీపంలోని కందిపేట గ్రామానికి చెందిన మీసాల నాని (20) మధురవాడ సమీపంలో ఉన్న గాయత్రి ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ తృతీయ సంవత్సరం చదువుతున్నాడు. ప్రైవేట్ వసతి గృహంలో ఉంటున్న నాని శుక్రవారం అయిదుగురు స్నేహితులతో కలిసి గంభీరం రిజర్వాయర్‌కు వచ్చాడు. అందరూ ఈత కొట్టేందుకు రిజర్వాయర్‌లోకి దిగగా నాని ఒక్కసారిగా మునిగిపోవడంతో స్నేహితులు కాపాడండి అంటూ గట్టిగా కేకలు వేశారు. సమీపంలో ఉన్న స్థానికులు కాపాడే ప్రయత్నం చేయగా అప్పటికే మృతిచెందడంతో పోలీసులకు సమాచారమిచ్చారు. సీఐ చింతావాసునాయుడు, ఎస్ఐ సురేశ్ సిబ్బందితో కలిసి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. స్నేహితులను వివరాలు అడిగి కుటుంబ సభ్యులకు విషయం తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమిలి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చెప్పారు.

వాల్తేరు రైల్వేలో గణతంత్ర వేడుకలకు ఏర్పాట్లు

ఆర్పీఎఫ్ సైనికుల కవాతు సాధన

విశాఖపట్నం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): వాల్తేరు రైల్వేలో ఆదివారం జరిగే గణతంత్ర వేడుకలకు ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. రైల్వే ఫుట్‌బాల్, అథ్లెటిక్స్ గ్రౌండ్‌లో జరిగే ఈ వేడుకలకు సంబంధించి వాల్తేరు రైల్వే ఆర్పీఎఫ్ విభాగం మూడు రోజులుగా ఏర్పాట్లలో నిమగ్నమైంది. ఢిల్లీలోని ఎర్రకోట నమూనాలో ప్రత్యేకంగా తాత్కాలిక సెట్ ఏర్పాటు చేస్తున్నారు. అలాగే గణతంత్ర దినోత్సవంలో రైల్వే ప్రొటెక్షన్ ఫోర్సు (ఆర్పీఎఫ్) చేసే కవాతుపై అధికారుల పర్యవేక్షణలో నాలుగు రోజులుగా ఉదయం, సాయంత్రం సైనికులు ముమ్మర సాధన చేస్తున్నారు. ఆర్పీఎఫ్, రైల్వే సివిల్ సర్వీసు, స్కౌట్స్ అండ్ గైడ్స్ వలంటీర్లు కూడా పాల్గొంటున్నారు. వేడుకలలో వివిధ ప్రదర్శనలకు సంబంధించి మోటారు వాహన విన్యాసాలలో ఆర్పీఎఫ్ సిబ్బంది, కవాతు బ్యాండ్‌లో కేంద్రీయ విద్యాలయ విద్యార్థులు ముమ్మరంగా సాధన చేస్తున్నారు. అనివార్య కారణాల వలన ఈ ఏడాది ఆర్పీఎఫ్ డాగ్ స్క్వాడ్ ప్రదర్శన ఏర్పాటు చేయడంలేదని తెలిసింది.



పరేడ్‌కు సాధన చేస్తున్న జవాన్లు

వైసీపీలో కలకలం

... 5వ పేజీ తరువాయి

వచ్చేశారని ప్రచారం జరుగుతోంది.

విశాఖలో ఆయన చెప్పిందే వేదం

వైసీపీ అధికారంలోకి రాక ముందే విజయసాయిరెడ్డి ఉత్తరాంధ్ర పార్టీ బాధ్యతలు తలకెత్తుకున్నారు. పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత విశాఖలో ఆయన చెప్పిందే వేదం అన్నట్టుగా సాగింది. మంత్రులు ఉన్నా వారికి ఎటువంటి విలువ దక్కలేదు. విశాఖలో జగన్ ఆదేశాలను తు.చ. తప్పకుండా అమలు చేశారు. ప్రతిపక్ష పార్టీ నాయకుల ఆస్తులను ధ్వంసం చేసి, కేసులు పెట్టి వేధించారు. దసపల్లా భూములను ప్రభుత్వ జాబితా నుంచి తప్పించారు. విశాఖ-భోగాపురం కోస్టల్ కారిడార్‌ను దారిమళ్లించారు. భీమిలి ప్రాంతంలో యజమానుల ఇష్టాఇష్టాలతో సంబంధం లేకుండా భూములను కొనుక్కున్నారు. సింహాచలం దేవస్థానం చైర్మన్ అశోక్‌గజపతిరాజును పక్కనపెట్టి ఆయన సోదరుడు ఆనందగజపతి కుమార్తె సంచయితను ఢిల్లీ నుంచి తీసుకువచ్చి చైర్‌పర్సన్‌ను చేసి ఆ కుటుంబంలో చిచ్చు పెట్టారు. చాలామందిని భయపెట్టి పార్టీ మారేలా చేశారు. 2024 ఎన్నికలకు ఏడాది ముందు సాయిరెడ్డిని ఇక్కడి నుంచి తప్పించి వైవీ సుబ్బారెడ్డిని ఇన్‌చార్జిగా వేశారు. పార్టీ ఓడిపోవడంతో సాయిరెడ్డికి జగన్ మళ్లీ విశాఖ జిల్లా పార్టీ బాధ్యతలు అప్పగించారు. ఈ మధ్య రెండు, మూడుసార్లు నగరానికి వచ్చి పార్టీ సమావేశాలు నిర్వహించారు. ఆయనతో నాటి ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, ఆడిటర్ జీవీ వంటి వారికి పొసిగేది కాదు. ఇరు వర్గాల మధ్య పచ్చగడ్డి వస్తే భగ్గుమనేది. ఇదిలావుండగా పార్టీ నుంచి నేతలు ఒక్కొక్కరు బయటకు వెళ్లిపోతుండడంతో నాయకులు, కార్యకర్తలు కలవరపడుతున్నారు. ఇటీవల మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు, పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడారి ఆనందకుమార్‌లు పార్టీకి రాజీనామా చేసిన విషయం తెలిసిందే.

మరో హనీ ట్రాప్ కేసు

... 5వ పేజీ తరువాయి

తాను తన కుమార్తెను బోయిపాలెం వద్ద హాస్టల్‌లో దింపేసి వెళ్లిపోతున్నానని చెప్పడంతో, కలుద్దామనుకున్నాం కదా అలా ఎలా వెళ్లిపోతారని వివాహిత ప్రశ్నించింది. దీంతో ఆయన తగరపువలస సమీపంలోని సంగివలస మూడుగుళ్ల అమ్మవారి ఆలయం వద్ద ఆటో దిగిపోతానని, అక్కడ కలుద్దామని చెప్పడంతో సరేనంది. ఆయన అక్కడ దిగి నిరీక్షిస్తుండగా మూడు బైకులపై ఆరుగురు వ్యక్తులు వెళ్లి...తమ బంధువైన మహిళకు ఫోన్ చేసి అసభ్యంగా మాట్లాడుతున్నావంటూ బైక్‌పై బలవంతంగా ఎక్కించుకుని విజయనగరం వైపు తీసుకువెళ్లారు. రఘు కాలేజీ సమీపంలోని నిర్మానుష్య ప్రాంతంలో బైకులు ఆపి ఆయన్ను చితగ్గొట్టారు. జేబులో ఉన్న రూ.50 వేలు, ఏటీఎం కార్డులు తీసుకున్నారు. సెల్‌ఫోన్ నుంచి రూ.8,900 తమకు ట్రాన్స్‌ఫర్ చేసుకున్నారు. ఈ విషయం ఎవరితోనైనా చెబితే చంపేస్తామని బెదిరించి, అతడిని అక్కడే వదిలేసి సెల్‌ఫోన్ లాక్కుని వెళ్లిపోయారు. ఆయన షర్టు జేబులో మిగిలిన రూ.500తో ఇంటికి వెళ్లిపోయాడు. ముఖం కమిలిపోయి, వంటినిండా దెబ్బలు ఉండడంతో కుటుంబసభ్యులు ప్రశ్నించారు. జరిగిన విషయాన్ని వివరించాడు. ఈనెల 22న భీమిలి చేరుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో విశాఖ నార్త్ క్రైమ్ సీఐ బీఎస్ఎన్ ప్రకాశ్ పర్యవేక్షణలో భీమిలి ఎస్ఐ సూర్యప్రకాశరావు, ఆరు బృందాలు నిందితుల సెల్‌ఫోన్ కాల్‌లిస్ట్, సీసీ కెమెరాల ఫుటేజిని పరిశీలించారు. చాకచక్యంగా నిందితులను పట్టుకుని వారి నుంచి మూడు బైకులు, కొంత నగదు స్వాధీనం చేసుకున్నారని తెలిసింది. ఐదుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నామని, పూర్తి వివరాలు ఉన్నతాధికారులు నగరంలో మీడియాకు తెలియజేస్తారని, కేసు దర్యాప్తులో ఉందని భీమిలి ఎస్ఐ సూర్యప్రకాశరావు తెలిపారు. నగరంలో రెండు నెలల క్రితం ఓ హనీ ట్రాప్ కేసు వెలుగుచూసిన విషయం తెలిసిందే.

క్రూయిజ్ షిప్ వచ్చేస్తుంది

... 5వ పేజీ తరువాయి

వస్తుంది. దీని వెడల్పు 376. మీటర్లు. డ్రాఫ్ 8.1 మీటర్లు. దీంతో పెద్ద పెద్ద క్రూయిజ్ షిప్‌లను కూడా తీసుకురావచ్చు. పార్కింగ్‌లో ఏడు బస్సులు, 70 కార్లు, 40 ద్విచక్ర వాహనాలు నిలుపుకొనేలా వసతి కల్పించారు. దీనిని కేంద్ర మంత్రి చేతులు మీదుగా 2023 సెప్టెంబరులో ప్రారంభించారు. 16 నెలలు పూర్తయింది. అప్పటి నుంచి బోణీ లేదు. ఒక్క క్రూయిజ్ షిప్ కూడా రాలేదు. పోర్టు అధికారులకు దానిని ఎలా నిర్వహించాలో తెలియకపోవడమే ప్రధాన కారణమని అంటున్నారు. జిల్లా పర్యాటక శాఖ అధికారులతో పలుమార్లు చర్చలు జరిపినా ఎటువంటి ఫలితం కనిపించలేదు. టూర్స్ అండ్ ట్రావెల్స్ ప్రతినిధులు కొందరు పలు సూచనలు చేయగా వాటిని పట్టించుకోలేదు. ఒక కమిటీని ఏర్పాటుచేసి, క్రూయిజ్ సంస్థల వద్దకు వెళ్లి, ఈ ప్రాంతం గురించి, పర్యాటక స్థలాల గురించి, టెర్మినల్ సౌకర్యం గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తే...కనీసం ఏడాది తరువాతైనా స్లాట్లు ఇస్తారని కొందరు సూచించగా అధికారులు పట్టించుకోలేదు. ఒకానొక సమయంలో పైనుంచి వచ్చిన ఒత్తిళ్ల తట్టుకోలేక టెర్మినల్ నిర్వహణ బాధ్యతలు ప్రైవేటుకు అప్పగించాలని కూడా చూశారు. పత్రికల్లో ప్రకటనలు ఇచ్చారు. అయితే ఎవరూ ముందుకు రాలేదు. దాంతో పోర్టు యాజమాన్యమే క్రూయిజ్ షిప్‌లను తీసుకురావలసిన పరిస్థితి వచ్చింది. తాజాగా ఏపీటీడీసీ ఎండీ ఆమ్రపాలి విశాఖపట్నం వచ్చి సమావేశం నిర్వహించడంతో విశాఖపట్నం పోర్టు 'ఆగస్టులో క్రూయిజ్' అంటూ ప్రకటన విడుదల చేసింది.

ఫ్రీ హోల్డ్ భూములపై విజిలెన్స్

... 5వ పేజీ తరువాయి

కొంతమంది పెద్దలు రైతులతో ముందస్తు ఒప్పందం చేసుకుని, ఆ తరువాత తమ పలుకుబడిని ఉపయోగించి ఫ్రీహోల్డ్ అనుమతులు పొందారనే ఆరోపణలు వచ్చాయి. రాష్ట్ర విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఓఎస్డీ కింజారపు ప్రభాకర్ ఆదేశాల మేరకు ఫ్రీహోల్డ్ భూములపై విజిలెన్స్ విచారణ చేపట్టామని డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ రేవతి తెలిపారు. దస్త్రాలు తనిఖీ చేసి నివేదికను ఉన్నతాధికారులకు సమర్పిస్తామన్నారు.

నగరంపై మంచుదుప్పటి

... 5వ పేజీ తరువాయి

నిపుణుడొకరు తెలిపారు. ఈ సీజన్‌లో పొగమంచు కురుస్తుందని, అయితే శుక్రవారం దాని తీవ్రత పెరిగిందన్నారు. ఇటువంటి సమయాల్లో వాహనాలు నడిపేవారు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రానున్న రెండు రోజుల్లో పొగమంచు ప్రభావం ఉంటుందన్నారు.

కాలుష్యంలో 'పూర్' కేటగిరీగా నమోదు

పొగమంచు ప్రభావంతో నగరంలో కాలుష్యం తీవ్రత పెరిగింది. శుక్రవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంపై ఉన్న యాంబియంట్ ఎయిర్ క్వాలిటీ మిషన్‌లో పీఎం-2.5 పూర్ కేటగిరీగా నమోదైంది. గడచిన నాలుగైదు రోజులుగా కురుస్తున్న మంచుకు ధూళి కణాలు పైకి పోకుండా భూమికి తక్కువ ఎత్తులోనే ఉండిపోవడంతో నగరంలో కాలుష్యం పెరిగిందని వాతావరణ నిపుణుడొకరు తెలిపారు. కాలుష్యం పెరిగిన నేపథ్యంలో పొగమంచు కురిసే సమయంలో ఆరుబయట తిరిగితే ఊపిరితిత్తుల సమస్య వస్తుందన్నారు. ఇంకా గొంతు నొప్పి, జలుబు చేసి జ్వరాల బారినపడతారని హెచ్చరించారు. ఆస్తమా, ఇస్నోఫీలియా వంటివి ఉన్నవారు మాస్క్‌లు ధరించాలన్నారు.

పక్కాగా క్యాన్సర్ స్క్రీనింగ్

... 5వ పేజీ తరువాయి

నిర్వ హిస్తున్నారు. అనుమానిత కేసులు గుర్తిస్తే స్థానిక పీహెచ్‌సీ వైద్యులకు సమాచారాన్ని అందిస్తారు. సదరు వైద్యుడు మరోసారి స్క్రీనింగ్ చేసి కేన్సర్ లక్షణాలుగా అనుమానిస్తే కేజీహెచ్‌కు రిఫర్ చేసి, తదుపరి వైద్యం ప్రారంభమయ్యేలా చూస్తారు. జిల్లాలో ఇప్పటివరకూ 2,61,670 మందికి పరీక్షలు నిర్వహించారు. ఇందులో 720 మందికి నోటి క్యాన్సర్ లక్షణాలు, 670 మందికి రొమ్ము క్యాన్సర్ లక్షణాలు, 730 మందికి సర్వైకల్ క్యాన్సర్ అనుమానిత లక్షణాలు ఉన్నట్టు గుర్తించారు. ఆ 2,120 మందిలో 600 మందికి రెండో దశ పరీక్షలు నిర్వహించిన అనంతరం 20 మందిని కేజీహెచ్‌కు రిఫర్ చేసినట్టు అధికారులు చెబుతున్నారు.

బీపీ, షుగర్ కేసులు భారీగా..

క్యాన్సర్‌తోపాటు ఇతర నాన్ కమ్యూనికబుల్ డిసీజ్‌లకు సంబంధించిన వివరాలను వైద్య సిబ్బంది సేకరిస్తున్నారు. ఇప్పటివరకూ పూర్తి చేసిన సర్వే ప్రకారం జిల్లాలో 25,700 మంది హైపర్ టెన్షన్, 19,290 మంది షుగర్‌తో బాధపడుతున్నట్టు గుర్తించారు. ఈ కేసులు సంఖ్య భారీగా ఉంటోందని చెబుతున్నారు. ప్రతి నాలుగైదు ఇళ్లలో వీటిలో ఏదో ఒక కేసు ఉంటోందని, గతంతో పోలిస్తే షుగర్, బీపీ బారినపడుతున్న వారి సంఖ్య పెరుగుతోందని అధికారులు పేర్కొంటున్నారు.

పకడ్బందీగా స్క్రీనింగ్ నిర్వహించాలని ఆదేశించాం

క్యాన్సర్‌ను ముందుగానే గుర్తించడం ద్వారా మెరుగైన వైద్య సేవలు అందించాలన్నది ప్రభుత్వ ఉద్దేశం. ఈ మేరకు క్షేత్ర స్థాయి సర్వే చేసే సిబ్బందికి తగిన సూచనలు చేశాం. ఏయే అంశాలను పరిగణనలోకి తీసుకోవాలనే విషయాలను తెలియ జేశాం. అనుమానిత లక్షణాలు ఉన్నట్టు గుర్తించిన వారికి ఇప్పటివరకూ దానిపై కనీసం అవగాహన కూడా లేదని వెల్లడైంది. ఈ తరహా ఇబ్బందులను అధిగమించేందుకే ప్రభుత్వం ఈ స్క్రీనింగ్ ప్రోగ్రామ్‌ను చేపట్టింది.

-డాక్టర్ పి.జగదీశ్వరరావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి

నిరంతరం పర్యవేక్షిస్తున్నాం

క్యాన్సర్ స్క్రీనింగ్‌ను పక్కాగా చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. దీంతో నిరంతరం స్క్రీనింగ్‌ను పర్యవేక్షిస్తున్నాం. సిబ్బంది ఇంటింటికీ వెళ్లి వారికి కేటాయించిన జాబితాలోని వివరాలను సేకరించి అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. అనుమానిత లక్షణాలు ఉన్నట్టయితే స్థానిక మెడికల్ ఆఫీసర్‌కు వివరాలు తెలియజేస్తారు. మెడికల్ ఆఫీసర్ వారిని మరోసారి పరీక్షించి అవసరమైతే కేజీహెచ్‌కు రిఫర్ చేస్తారు. ఇక్కడ మిగిలిన పరీక్షలు పూర్తిచేసి వైద్య సేవలు అందించే ఏర్పాట్లు చేస్తున్నాం.

- డాక్టర్ హారిక, ఆర్‌బీఎస్‌కే, ఎన్‌సీడీసీడీ ప్రోగ్రామ్ ఆఫీసర్

'స్టీల్‌ప్లాంటులో సీఐఎస్‌ఎఫ్ సిబ్బంది కుదింపు సరికాదు'

ఉక్కుటౌన్ షిప్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) :స్టీల్‌ప్లాంట్‌లో సీఐఎస్‌ఎఫ్ సిబ్బంది తగ్గింపు సరికాదని, అటువంటి ప్రయత్నాలను యాజమాన్యం విరమించుకోవాలని సీఐటీయూ గౌరవధ్యక్షుడు అయోధ్యరామ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సిబ్బంది తగ్గింపు వల్ల ప్లాంట్ భద్రతకు ముప్పు వాటిల్లుతుందన్నారు. 40 ఏళ్లలో సీఐఎస్‌ఎఫ్ సిబ్బంది ఎన్నో సేవలందించారని, అటువంటిది ఇప్పుడు సిబ్బంది తగ్గింపు చేయటానికి యాజమాన్యం తీసుకుంటున్న చర్యలను మానుకోవాలన్నారు.

నటుడు 'బెల్లాన'కు సన్మానం



నాగేశ్వరరావును సత్కరిస్తున్న మంత్రి రాజశేఖర్, ఇతర పెద్దలు

పెదగంట్యాడ, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : సినీ నటుడు, సాంఘిక నాటక నటుడు బెల్లాల నాగేశ్వరరావును శ్రీమాతృశ్రీకళానికేతన్ సంస్థ శుక్రవారం ఘనంగా సన్మానించి హాస్యకళానిధి బిరుదును ప్రకటించింది. నాటక రంగంలో నంది అవార్డు గ్రహీత దివంగత సంగమేశ్వరరావు జయంతి సందర్భంగా నడుపూరు రామాలయం దరి కళావేదికలో కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం రావి నాగేశ్వరరావు రాసిన 'నిన్ను నువ్వు తెలుసుకో..'నాటికను ప్రదర్శించారు. జబర్దస్త్ ఫేం సత్తిపండు ఈ ప్రదర్శనకు దర్శకత్వం వహించారు. కార్యక్రమంలో ఇంటక్ జాతీయ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్, 76వ వార్డు కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు, జబర్దస్త్ ఫేం సత్తిపండు, ఎఫ్ఎం బాబాయ్, స్థానిక నాయకులు, కులుకూరి మంగరాజు,బొడ్డు కృష్ణారావు, రౌతు గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

చిత్రలేఖనంలో ఏబీఎస్ విద్యార్థుల ప్రతిభ

అగనంపూడి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల ముంబైలోని రంగోత్సవ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జాతీయ స్థాయి చిత్ర లేఖనం పోటీల్లో ఏబీఎస్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి 50 బంగారు పతకాలు,40 రజత పతకాలు, 20 క్యాంస పతకాలు సాధించారు. విద్యార్థులను శుక్రవారం పాఠశాల కరస్పాండెంట్ పీఎం కొండయ్య అభినందించారు.

ఘనంగా రామాలయ తీర్థం

గోపాలపట్నం,జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : చంద్రనగర్‌లో కొలువైన సీతారాముల ఆలయ తీర్థ మహోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. అర్చకులు ఉత్సవమూర్తులను సుందరంగా అలంకరించారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు హాజరై స్వామివారికి పూజలు, అభిషేకాలు చేశారు.

సినిమా గైడ్

● **సంక్రాంతికి వస్తున్నాం :** శ్రీలీలామహల్, శారద, శ్రీరామ, మెలోడి, జగదాంబ, సంగం, కామేశ్వరి, కిన్నెర, గోకుల్, కాంతి, శ్రీలక్ష్మీనరసింహ-1,2 (104 ఏరియా), శ్రీనరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య, మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), తాతా, రాములమ్మ (తగరపువలస)

● **డాకు మహారాజ్ :** జగదాంబ, శ్రీవెంకటేశ్వర, శరత్, శ్రీకన్య, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య, సౌజన్య (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్, శ్రీకన్య హెవెన్ (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), గణేష్, సప్తగిరి (తగరపువలస),

● **గేమ్ ఛేంజర్ :** మెలోడి, సంగం, రమాదేవి, వెంకటేశ్వర, కామేశ్వరి, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం),కన్యకాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-2 (పెందుర్తి) రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 35, టమాటా 14, వంకాయలు(తెలుపు) 28, వంకాయలు (నలుపు) 36, బెండకాయలు 46, పచ్చిమిర్చి 40, కాకరకాయలు 46, బీరకాయలు 52, ఆనపకాయ 16, కాలీఫ్లవర్ 20, క్యాబేజి 14, క్యారెట్ 28 దొండకాయలు 42, బంగాళ దుంపలు 26, అరటికాయ(పె)7,మునక్కాడలు (కిలో) 110,అల్లం (పాతది) 46, బరబాటీ42, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 65, బద్ద చిక్కుడు 24, దోసకాయలు 32, వెల్లుల్లి (పెద్దవి) 290, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 44, పొటల్స్ 80, కీరదోస 34, కాప్సికమ్ 44, పొట్లకాయ (పెద్దది) 28, చేమ దుంపలు 48, చిలగడదుంపలు 40, కంద 56, దేముడుచిక్కుడు 40, గోరు చిక్కు డు 30, ఆగాకార దేశవాలి 100, ఆగాకర హైబ్రిడ్ 50, కూరపెండలం 26, బ్రకోలి 80, నూల్‌కోల్ 34, పనసపొట్టు 200, కొండ ఉసిరి 70, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 25, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 150, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 20, మామిడి అల్లం 46, బొప్పాయి 35, జామకాయలు (కిలో) 60. .

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	485
విజయనగరం	489
శ్రీకాకుళం	489

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	120
లైవ్ ధర	140
విత్ స్కిన్	250
స్కిన్‌లెస్	260

పారిశ్రామిక ప్రాంతాన్ని కమ్మేసిన పొగమంచు

» మన్యాన్ని తలపించిన గాజువాక పరిసరాలు
» దట్టంగా మంచు పడడంతో ఎదుటి వ్యక్తి కనిపించని పరిస్థితి
» చలిగాలులతో ఇబ్బందులు
» వాహనాల రాకపోకలకు అవస్థలు



కూర్మన్నపాలెంలో కమ్ముకున్న పొగమంచు

గాజువాక/ ఆటోనగర్/ అగనంపూడి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : పారిశ్రామిక ప్రాంతంలోని గాజువాక, ఆటోనగర్, అగనంపూడిప్రాంతాల్లో శుక్రవారం ఉదయం అరకును తలపించింది. వేకువజామున తెల్లటి మంచు దుప్పటి పరచుకొంది. అక్కడ తిరిగే వారు మేఘాల్లో సంచరిస్తున్న అనుభూతికి లోనయ్యారు. మునుపెన్నడూ ఇక్కడ ఇటువంటి దృశ్యాలు చూడని వారంతా సంభ్రమాశ్చర్యాలకు గురయ్యారు. వేకువజాము 3 గంటల నుంచే వాతావరణంలో పూర్తిగా పొగమంచు ఆవరించిందని, 5 గంటల ప్రాంతంలో ఈ ప్రాంతమంతా మంచుతో నిండిపోయింది.

మల్కాపురం : మల్కాపురం ప్రాంతాన్ని పొగమంచు కమ్మేసింది. దీనికితోడు పరిశ్రమల నుంచి అదే సమయంలో విపరీతంగా కాలుష్యం విడుదలైంది. అటు పొగమంచు, ఇటు కాలుష్యం వల్ల ప్రజలు ఉక్కిరిబిక్కిరయ్యారు. వేకువజామున 5 నుంచి 8 వరకు దట్టమైన పొగమంచు పడడంతో వాహనాలు రాకపోకలు సాగించడం ఎంతో కష్టమైంది. పది అడుగుల దూరంలో ఉన్న వాహనం కూడా కనిపించకపోవడంతో లైట్లు వేసుకొని ప్రయాణాలు సాగించారు. హెచ్‌పీసీఎల్ అడ్మినిస్ట్రేషన్ కార్యాలయాన్ని పూర్తిగా పొగమంచు కమ్మేయడంతో ఉద్యోగులు ఇబ్బంది పడ్డారు.



పొగమంచుతో నిండిపోయిన గాజువాక జంక్షన్

'వేతనాల చెల్లింపులో నిర్లక్ష్యం తగదు'



ప్లాంట్ సీజీఎంకు వినతిపత్రం అందజేస్తున్న గుర్తింపు యూనియన్ నాయకులు

ఉక్కుటౌన్‌షిప్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : ఉక్కు ఉద్యోగులకు వేతనాల చెల్లింపులో యాజమాన్యం నిర్లక్ష్యం విడనాడాలని గుర్తింపు యూనియన్ ప్రధాన కార్యదర్శి కేఎస్ఎన్ రావు అన్నారు. వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ప్లాంట్ ఈడీ (వర్క్స్) కార్యాలయం వద్ద శుక్రవారం గుర్తింపు యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవీ విరమణ చేసిన ఉద్యోగులను ఇబ్బందులు పెట్టాలనే లక్ష్యంతో మెడికల్ ఇన్సూరెన్స్ భారీగా పెంచారన్నారు. అలాగే ఉద్యోగులు నాలుగు నెలలుగా జీతాల కోసం ఎదురు చూస్తున్నారన్నారు. జీతాలు లేక ఉద్యోగులు మానసికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. అనంతరం సీజీఎంకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు జె.రామకృష్ణ, జి.గణపతి రెడ్డి, మోహన్‌బాబు, మహాలక్ష్మినాయుడు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడికి అభినందనలు



పరశురామ్‌రాజుకు అభినందిస్తున్న నరసింగరావు తదతరులు

గాజువాక, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన పరశురామ్‌రాజును బీజేపీ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు శుక్రవారం కలిసి అభినందనలు తెలిపారు. గాజువాకలో పార్టీ బలంగా ఉందని, కేంద్రం, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంపై ప్రజలు ఎంతో విశ్వాసంగా ఉన్నారని పేర్కొన్నారు. స్టీల్‌ప్లాంట్‌కు కేంద్రం కేటాయించిన నిధులపై విస్తృత ప్రచారం చేయాలని జిల్లా అధ్యక్షుడు సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు దీనంకొండ కృష్ణంరాజు, బొండా యల్లాజీరావు, నాగేశ్వరరావు, రంగనాయకులు, పేర్ల అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రామ్‌నగర్ కోదండరామాలయ పరస



అక్కిరెడ్డిపాలెం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ విశాఖ 68వ వార్డు పరిధిలోని రామ్‌నగర్‌లో కోదండరాముల పరస శుక్రవారం వైభవంగా జరిగింది. సర్వాంగసుందరంగా ముస్తాబైన కోదండరామాలయంలో సీతారాములను ప్రత్యేక పూలు, నగలతో అలంకరించారు. ఉదయం నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. మాజీ రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్‌నాథ్, కార్పొరేటర్ గుడివాడ అనూష, మాజీ కౌన్సిలర్ ఈటి శ్యామలరావు, గుడివాడ లతీష్, శ్రీధర్, రాజు తదితరులు సీతారాములను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

పాఠశాలల్లో బాలికా దినోత్సవం



గాజువాక : ప్లకార్డులు ప్రదర్శిస్తున్న విద్యార్థినులు

పెదగంట్యాడ, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : మహిళలు విద్యావంతులైతే ఆ కుటుంబం, తద్వారా సమాజం చైతన్యవంతమవుతుందని దుర్గవానిపాలెం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎంవీ సుశీల అన్నారు. అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా పాఠశాల ఆవరణలో 'బాలికలను రక్షిద్దాం, వారిని చదివిద్దాం' నినాదంతో అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ శతశాతం బాలికలు అక్షరాస్యులుగా ఉండాలన్నారు. అనంతరం దుర్గవానిపాలెం కాలనీలో ర్యాలీ నిర్వహించిన ర్యాలీని పెదగంట్యాడ పీహెచ్‌సీ వైద్యాధికారి రమేష్‌బాబు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో సీహెచ్ సత్యనారాయణ, పాఠశాల ఉపాధ్యాయులు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, పారా మెడికల్ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

గాజువాక : బాలికలపై జరుగుతున్న అకృత్యాలను నివారించేందుకు చట్టాలను కఠినం చేసి శిక్షించాలని చేపలపాలెం ఎంపీపీ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు కూరపాటి వినోద్‌కుమార్ అన్నారు. పాఠశాలలో శుక్రవారం జాతీయ బాలికల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికలు ధైర్యంగా ఉండాలని, ఎటువంటి ఆపద వచ్చినా నిరుత్సాహ పడవద్దన్నారు. ఆపద సమయంలో 100, 1100, 112 వంటి నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు. వీటిపై అవగాహన కల్పించే విధంగా ప్లకార్డులను ప్రదర్శించారు. కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్‌పై పర్యవేక్షణ లోపం

ఎన్ఏడీ జంక్షన్,జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 90వ వార్డు బాజీ జంక్షన్ సంత వెనుక ఉన్న అన్న క్యాంటీన్‌పై అధికారుల పర్యవేక్షణ లోపించింది. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా క్యాషియర్ వ్యవహారశైలి సక్రమంగా లేకపోవడంతో తరచూ వివాదాలు జరుగుతున్నాయి. ఆమె ప్రవర్తన వల్ల ఉద్యోగులతో పాటు భోజనానికి వస్తున్న వారు ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ క్యాంటీన్ ఏర్పాటు చేసిన నాలుగు నెలల్లో మూడు నెలలు పాటు కేవలం రెండు పూరీలు వడ్డించడం విశేషం. ఇంత జరిగినా.. యూసీడీ విభాగంలో పని చేసే సీఓలు, ఏపీడీలు పరిశీలన చేయలేదు. క్యాంటీన్‌లో జరుగుతున్న అవకతవకలపై ఒక ఉద్యోగి వీడియో తీసి,అక్షయ పాత్ర ఫౌండేషన్ తనిఖీ విభాగానికి పంపించారు.రెండు రోజుల క్రితం వారు క్యాంటీన్‌కు వచ్చి విచారణ జరిపారు. కాగా క్యాషియర్‌కు యూసీడీ విభాగంలో ఒక ఉన్నతాధికారి, ఎమ్మెల్యేకు చెందిన అనుచర గణం అండఉండడంతో అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని తెలిసింది.

విద్యార్థి అదృశ్యంపై ఫిర్యాదు

పెందుర్తి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : కళాశాలకు వెళ్లి సక్రమంగా చదువుకోమని తల్లిదండ్రులు మందలించడంతో పాలిటెక్నిక్ విద్యార్థి ఇంటి నుంచి పారిపోయాడు. సీఐ సతీశ్‌కుమార్ తెలిపిన వివరాలు ప్రకారం.. పెందుర్తి రాతిచెరువులో నివాసం ఉంటున్న దమరు సింగ్ (18) ఆనందపురం గణపతి పాలిటెక్నిక్ కళాశాలలో ఈఈఈ తృతీయ సంవత్సరం చదువుతున్నాడు. కొద్ది రోజులుగా కళాశాలకు వెళ్లకపోవడంతో తల్లిదండ్రులు మందలించారు. దీంతో ఈనెల 22న ఇంటి నుంచి వెళ్లిపోయిన విద్యార్థి తిరిగి చేరుకోలేదు,. కుటుంబ సభ్యులు స్థానికంగా, బంధువులు, స్నేహితులు ఇళ్లల్లో వెతికినా ఆచూకీ లేకపోవడంతో పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. సీఐ సతీశ్‌కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు. అలాగే వేపగుంట సమీపంలోని ప్రహ్లాదపురానికి చెందిన దాడి రాము (35) ఈనెల 19 నుంచి కనిపించడం లేదని అతని భార్య కుమారి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పోలీసుల అదుపులో బ్యాటరీల దొంగలు ?

మల్కాపురం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : హెచ్‌పీసీఎల్ వద్ద పార్కింగ్ చేసిన వాహనాల నుంచి బ్యాటరీలు దొంగలిస్తున్న వారు ఎట్టకేలకు పట్టుబడ్డారు. కొంతకాలంగా వాహనాల బ్యాటరీలు, వాహనాలు చోరీ కావడంపై అందరిలోనూ ఆందోళన నెలకొంది. శుక్రవారం ఇద్దరు వ్యక్తులు వాహనాల నుంచి బ్యాటరీలు తీస్తుండగా అటుగా వెళ్లిన కార్మికులు వారిని పట్టుకొని గట్టిగా నిలదీశారు. ఈ విషయాన్ని మల్కాపురం పోలీసులకు తెలియజేయడంతో వారిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

రాష్ట్రానికి పెట్టుబడుల వెల్లువ

ప్రభుత్వ విప్ గణబాబు



వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే గణబాబు

గోపాలపట్నం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : దావోస్‌లో జరిగిన పెట్టుబడుదారుల సదస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు బృందం రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకురావడంలో సఫలీకృతమైందని ప్రభుత్వ విప్,పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు అన్నారు. శుక్రవారం ఆయన తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.జగన్ ప్రభుత్వం అనుసరించిన విధానాల వల్ల గత ఐదేళ్లలో పెట్టుబడుదారులు రాష్ట్రానికి ప్రాధాన్యత ఇవ్వలేదని, వైసీపీ మంత్రులు చేసిన పర్యటనలు కూడా ఫలితమివ్వలేదని గుర్తు చేశారు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలన్న తపనతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు బృందం చేసిన పర్యటనలో పలు దిగ్గజ కంపెనీలతో జరిగిన చర్చల్లో ఏపీ బ్రాండ్ మరోసారి నిలబెట్టారని కొనియాడారు. స్విస్‌మెన్ సంస్థ రాష్ట్రంలో రీసెర్చ్, టెక్స్ టైల్ సెంటర్ ఏర్పాటు చేయడానికి ముందుకు రావడం అభినందనీయమని చెప్పారు. అలాగే ప్రపంచంలోనే అతి పెద్ద సముద్రయాన రంగ సంస్థ మార్స్క్ రాష్ట్రంలో తమ కార్యకలాపాలు ప్రారంభించడానికి సుముఖత వ్యక్తం చేయడం తీర ప్రాంతాల అభివృద్ధికి దోహదపడుతుందన్నారు.సిస్కో, ఎల్జీకెమ్, కార్ల్‌బెర్గ్‌తో పాటు పలు సంస్థలు రాష్ట్రంలో పెట్టుబడులకు ముందుకు రావడం శుభ సూచకమని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ఏపీ కోల్పోయిన పూర్వ వైభవాన్ని తీసుకురావడానికి చంద్రబాబు కృషి చేస్తున్నారని చెప్పడానికి దావోస్ పర్యటన సఫలీకృతమే నిదర్శనమని పేర్కొన్నారు.

సమస్యల పరిష్కారానికే 'ప్రజా దర్బార్'

ఎన్ఏడీ : ప్రజా సమస్యలను దశల వారీగా పరిష్కరించడానికి ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే గణబాబు తెలిపారు. 52వ వార్డు కరాస రామాలయం వద్ద శుక్రవారం నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ఆయన మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వం చిన్న సమస్యను కూడా పరిష్కరించలేదన్నారు. ప్రజాదర్బార్‌లో వివిధ సమస్యలపై 300 అర్జీలు రాగా వాటిని అధికారులకు పంపించి, పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జెడ్సీ రాము, తహసీల్దార్ రమేశ్, ఏఎంఓహెచ్ సునీల్‌కుమార్, ఏపీడీ కృపానందం, ఏఈ వెంకటేశ్వర్లు, టీడీపీ నాయకులు వైటీఆర్, చంద్రశేఖర్, బాస్కర్, శ్రీను, అప్పారావు పాల్గొన్నారు.



స్వచ్ఛ భారత్.. స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్

వేపగుంట, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : గోపాలపట్నం పెట్రోల్ బంకు దరి ఆక్వార్స్ క్యాంపస్‌లో శుక్రవారం స్వచ్ఛ భారత్ - స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు ఇండియా మ్యాప్ ఆకృతిలో నిల్చొని ప్రతిజ్ఞ చేశారు. 200 మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు మైదానంలో దేశ సమైక్యతను, స్వచ్ఛంధ్రా, స్వర్ణాంధ్ర విశిష్టతను తెలియజేసేలా ప్రదర్శన నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని విద్యార్థులతో ఉపాధ్యాయులు ప్రతిజ్ఞ చేయించారు. మొక్కలు నాటడంతో పాటు వాటిని పరిరక్షించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల క్యాంపస్ కోఆర్డినేటర్ భగవాన్, ప్రిన్సిపాల్స్ గోపి, హేమ చందర్, డైరెక్టర్ హర్షలత, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

హాకర్స్ జోన్ ఏర్పాటు చేయాలని ధర్నా



కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న చిరు వ్యాపారులు

వేపగుంట, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : రహదారులపై ప్రత్యేక హాకర్స్ జోన్ ఏర్పాటు చేయాలని కోరుతూ వేపగుంట జోనల్ కార్యాలయం ఎదుట ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జోన్ 8 చిరువ్యాపారులు శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పుమేరకు చిరువ్యాపారులు,తోపుడు బండ్లకు ప్రత్యేక హాకర్స్ జోన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. నాలుగు రోజుల నుంచి రోడ్డుపై చిరువ్యాపారాలు నిర్వహించే వారిపై జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ సిబ్బంది, ట్రాఫిక్ పోలీసులు వేధిస్తున్నారని ఆరోపించారు. అనంతరం వారంతా జోన్ సూపరిటెండెంట్ పీవీవీఎస్ఎస్ మూర్తికి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఏఐ టీయూసీ నాయకులు ఆర్. శ్రీనివాస్, ముత్యమాంబ తోపుడు బళ్ల సంఘం అధ్యక్షుడు వై. రాంబాబు, సీపీఐ నాయకులు అసిరినాయుడు, శ్రీను,గౌరీ, సత్యనారాయణ, వసంత తదితరులు పాల్గొన్నారు.



రిలే నిరాహార దీక్షల్లో పాల్గొన్న మాజీ మంత్రి శైలాజానాథ్, కార్మిక నేతలు మంత్రి రాజశేఖర్, డి. ఆదినారాయణ

ప్యాకేజీ శాశ్వత పరిష్కారం కాదు : శైలజానాథ్

కూర్మన్నపాలెం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : ఉక్కు కర్మాగారానికి తాత్కాలిక ప్యాకేజీల వలన కొంత మేరకు మేలు జరిగినా అది శాశ్వత పరిష్కారం మాత్రం కాదని ఏపీసీసీ మాజీ అధ్యక్షుడు శైలజానాథ్ పేర్కొన్నారు. కూర్మన్నపాలెంలో శుక్రవారం 1443వ రోజు ఉక్కు దీక్షలలో పాల్గొన్న కార్మికుల దీక్షల శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విశాఖ ఉక్కుతో ప్రజలకు ఎన్నో భావోద్వేగాలు ముడిపడి ఉన్నాయన్నారు. అన్ని రాజకీయ పార్టీలు ఒకే తాటిపైకి వచ్చి స్టీలుప్లాంటును కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్లాంటుకు సొంతగనులు కేటాయించి, పూర్తిస్థాయిలో ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచాలని, శాశ్వతంగా ప్రైవేటీకరణ నుంచి రక్షణ కల్పించి,లాభాలు వచ్చేలా చేయాల్సిన బాధ్యత కేంద్రంపై ఉందన్నారు. కర్మాగారాన్ని సెయిల్‌లో విలీనం చేస్తున్నట్టు ప్రధానమంత్రి స్పష్టమైన ప్రకటన చేసే వరకూ కార్మికుల దీక్ష ఆగదన్నారు. విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు మంత్రి రాజశేఖర్, డి.ఆదినారాయణ, ఏపీసీసీ అధికార ప్రతినిధి జెర్రిపోతుల ముత్యాలు మాట్లాడుతూ విశాఖ ఉద్యోగులకు తక్షణమే జీతాల బకాయిలు వెంటనే చెల్లించాలని, 3 ఏళ్ల ట్యాక్స్ హాలిడే ఇవ్వాలని, నిలిపేసిన 800 మంది కాంట్రాక్టు కార్మికులకు వెంటనే విదుల్లోకి తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నేతలు నారాయణరావు, సురేష్, రాజాబాబు, సన్యాసిరావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఏ కష్టమొచ్చినా అండగా ఉంటా : ఎమ్మెల్యే పల్లా



నాగేశ్వరరావును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే పల్లా

కూర్మన్నపాలెం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): టీడీపీ అభిమానులు, కార్యకర్తలకు ఏ కష్టమొచ్చినా అండగా ఉంటానని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ 86వ వార్డు వుడా నగర్‌కు చెందిన సీనియర్ టీడీపీ అభిమాని నాగేశ్వరరావుకు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. ఈ నేపథ్యంలో ఆయన ఇంటికి పల్లా శ్రీనివాసరావు తదితరులు వెళ్లి సందర్శించారు. ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. పల్లా వెంట వార్డు టీడీపీ ఇన్‌చార్జి నల్లూరు సూర్యనారాయణ, గాజువాక టీడీపీ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాసరావు, నేతలు వి.శ్రీను, కనకరాజు ఉన్నారు.

'స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ప్రథమ స్థానం సాధించాలి'

అగనంపూడి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛసర్వేక్షణ్‌లో విశాఖ నగరాన్ని దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిపే విధంగా ప్రజలంతా సహకరించాలని గాజువాక జోన్ శానిటరీ సూపర్‌వైజర్ (ఎస్ఎస్) బీవీ రామారావు పిలుపునిచ్చారు. కొండయ్యవలసలో స్వచ్ఛ సర్వేక్షణ్, ప్లాస్టిక్ నిషేధంపై శుక్రవారం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నగరంలో ప్లాసిక్ కవర్లు నిషేధించినట్టు చెప్పారు. ఇందుకు ప్రజల నుంచి సహకారం తప్పనిసరిగా కావాలన్నారు. ప్రతి ఒక్కరూ గుడ్డ, నార సంచులను వినియోగించాలన్నారు. దుకాణాల్లో ప్లాస్టిక్ కవర్లను వినియోగిస్తే జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో టీడీపీ వార్డు అధ్యక్షుడు కర్రి దశేంద్ర, బి.సత్యనారాయణ, డొక్కా రమేశ్, బండారు చందూరమేశ్, రాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్‌లు సీతారామయ్య, సచివాలయం సిబ్బందిపాల్గొన్నారు.

దావోస్ వెళ్తే.. దారి ఖర్చులు కూడా రాలేదు

- మాజీ మంత్రి అంబటి రాంబాబు

గోపాలపట్నం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకువస్తామని దావోస్ సదస్సుకు వెళ్లిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు బృందానికి దారి ఖర్చులు కూడా రాలేదని మాజీ మంత్రి అంబటి రాంబాబు ఎద్దేవా చేశారు. నగరంలో జరిగిన ఓ కార్యక్రమానికి హాజరైన ఆయన శుక్రవారం రాత్రి విమానాశ్రయంలో విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు బృందం రాష్ట్రానికి ఎన్ని రూ. కోట్లు పెట్టుబడులు తీసుకువచ్చారు, అక్కడికి వెళ్లడానికి ఎన్ని కోట్లు ఖర్చు చేశారో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. సింగడు అద్దంకి వెళ్లొచ్చాడన్న సామెతలా చంద్రబాబు దావోస్ పర్యటన ఉందని విమర్శించారు. విశాఖను ఎవరు అభివృద్ధి చేసినా, చేయకపోయినా సొంతంగా వృద్ధి చెందేలా ఇక్కడ సహజ వనరులు ఉన్నాయని, అమరావతిని ఎంత అభివృద్ధి చేయాలని ప్రయత్నించినా ఫలితం ఉండదని పేర్కొన్నారు.

కాంట్రాక్టు కార్మికుల ఆందోళన



హెచ్‌పీఎల్ గేటు వద్దకు చేరుకున్న కార్మికులు

మల్కాపురం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : హెచ్‌పీసీఎల్‌లోని ఎల్అండ్‌టీ సంస్థలో పనిచేస్తున్న వివిధ రాష్ట్రాలకు చెందిన కార్మికులను కాంట్రాక్టర్ విధుల నుంచి తొలగించడంతో శుక్రవారం వారు మెయిన్ గేటు వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తామంతా రెండేళ్లుగా కష్టపడి పనిచేశామని, ఇప్పుడు ఎటువంటి బెనిఫిట్స్ చెల్లించకుండా పని అయ్యిపోయిందన్న కారణంతో విధుల నుంచి తొలగించడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. విధుల నుంచి తొలగించేటప్పుడు ఫైనల్ సెటిల్‌మెంట్ నెలకు ఆరు రోజులు చొప్పున అదనంగా వేతనం ఇవ్వాల్సి ఉందని, అలా కాకుండా నెలకు నాలుగు రోజులు చొప్పున ఫైనల్ సెటిల్‌మెంట్ చేస్తామని చెబుతున్నారని తెలిపారు. ఒక్క ఎల్అండ్‌టీ కంపెనీ కాకుండా మిగతా వారు కూడా ఈ విషయంలో కార్మికులకు అన్యాయం చేస్తున్నారని వాపోతున్నారు. యాజమాన్యం స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

రాంపురంలో పశు వైద్య శిబిరం

పెందుర్తి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) :పాడి రైతులు పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని జడ్పీటీసీ మాజీ సభ్యుడు రెడ్డి నారాయణరావు అన్నారు. రాంపురంలో శుక్రవారం జిల్లా పశుసంవర్థక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పశు వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాడిపరిశ్రమ ద్వారా రైతులు అధిక ఆదాయాన్ని పొందేలా వైద్యాధికారులు కృషి చేయాలన్నారు. శిబిరంలో పాడి పశువులకు గర్భకోశ వ్యాధిపై చికిత్స అందించారు. లేగ దూడలకు డీవార్మింగ్ మాత్రలు వేశారు. బందవానిపాలెంలో మండల పశు వైద్యాధికారి జగన్మోహనరావు ఆధ్వర్యంలో నిర్వహించిన పశు వైద్య శిబిరాన్ని పశుసంవర్థక శాఖ ప్రత్యేకాధికారి చిన్నయ్య ప్రారంభించారు. సిబ్బంది 276 పశువులకు గర్భ పరీక్షలు, నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంయుక్త సంచాలకులు రామకృష్ణ, ఉప సంచాలకులు చంద్రశేఖర్, రవికుమార్ పాల్గొన్నారు.

28న సత్యమాంబ పరస

పెందుర్తిరూరల్, జనవరి 24 : వేపగుంట, పినగాడి ప్రధాన మార్గంలో మేహాద్రిగెడ్డ బ్రిడ్జి వద్ద ఉన్న ఏడు గ్రామాల ప్రజల ఆరాధ్య దేవత సత్యమాంబ పరస ఈనెల 28న నిర్వహించనున్నారు. ఈమేరకు కమిటీ సభ్యులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయాన్ని శోభాయమానంగా ముస్తాబు చేస్తున్నారు. ఆ రోజు సాయంత్రం శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట శాంతారావు బృందంతో బుర్రకథ ప్రదర్శన ఏర్పాటు చేసినట్టు నిర్వాహకులు తెలిపారు.



ప్రణాళికతో పదింతల ఫలితం

పదో తరగతి విద్యార్థులకు నిపుణుల సూచనలు

ఇప్పటి నుంచే సాధన చేస్తే మేలు

మార్చి 17 నుంచి టెన్త్ పరీక్షలు



విద్యార్థి జీవితానికి తొలి విజయ సోపానం పదోతరగతి. ఉత్తమ ఫలితాల సాధనకు విద్యార్థులు ఇక్కడే బాటలు వేసుకోవాల్సి ఉంటుంది. మంచి మార్కులు పొందేందుకు ప్రణాళికాబద్ధ సాధన అవసరం. ఇందుకోసం నిపుణుల సలహాలు, సూచనలు పాటించడంతో పాటు, రోజులో ఎన్ని గంటలు చదువుకు కేటాయించాలో కూడా నిర్దేశించుకోవాలి. చదువుతో పాటు తగిన నిద్ర, విశ్రాంతి అవసరమని తెలుసుకుని, అందుకు తగిన విధంగా టైం టేబుల్ రూపొందించుకోవాలి. మార్చి 17 నుంచి పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థులకు నిపుణుల సూచనలివి. - కూర్మన్నపాలెం, ఆంధ్రజ్యోతి



తెలుగు చాలా సులువు

తెలుగులో మూడు విభాగాలపై అంశాలుంటాయి. అవగాహన-ప్రతిస్పందనకు 32, వ్యక్తీకరణ-సృజనాత్మకతకు 36, భాషాంశాలకు 32 మార్కులుంటాయి. పద్య పాఠ్యాంశాల నుంచి నాలుగు ప్రశ్నలు ఇస్తారు. ఒక్కోదానికి రెండు మార్కులు. రెండో ప్రశ్న పరిచిత గద్యభాగం, మూడో ప్రశ్న ఉపవాచకం నుంచి నాలుగు వాక్యాలిచ్చి ఏ కాండమునకు చెందినవో రాయాలి. నాలుగో ప్రశ్నగా కరపత్రం, లేఖ ఏదో ఒక అంశం ఇచ్చి నాలుగు ప్రశ్నలు ఇస్తారు. వ్యక్తీకరణ-సృజనాత్మకత భాగంలో 5,6,7 ప్రశ్నలు అన్నీ రాయాలి. కవి పరిచయం, పద్య పాఠ్యాంశాలు చదవాలి. 6,7వ ప్రశ్నలకు పరిచయం, కథనం, వ్యాసం, నాటకం, నేపథ్యం ఉంటుంది. 8,9,10 వ్యాస రూప ప్రశ్నలు. 11 నుంచి 19 వరకూ 2 మార్కుల ప్రశ్నలు (శబ్ద, అర్థాలంకాలు, ఛందస్సు, జాతీయాలు ఉంటాయి. వాటితో పాటు సంధులు, సమాసాలు, వాక్యాలపై నిరంతర సాధన అవసరం.

- వీవీ రమాకుమారి, తెలుగు ఉపాధ్యాయిని



అధికమార్కులిచ్చే హిందీ

ఇందులో ఆరు విభాగాలుంటాయి. భాషీబాత్ 12, అర్థ్ గ్రాహ్యత్, ప్రతి ప్రక్రియ, కవుల జీవిత చరిత్ర 8, ఉపవాచకం 24, పద్య, గద్య భాగాలు 20, ఆరో భాగంలో 16 మార్కులు. హిందీతో సులువుగా మార్కులను సాధించవచ్చు. వ్యాకరణాంశాలకు సంబంధించి జవాబులు ప్రశ్నపత్రంలోనే ఉంటాయి. వాటిని గుర్తించాలి. పద్య, గద్య భాగాలకు రెండు పేరాగ్రాఫ్‌లుంటాయి. అర్థం చేసుకొంటే సులువుగా జవాబులు రాయవచ్చు. కవి పరిచయం, కబీర్‌కు సంబంధించిన ప్రశ్నలు, పద్యభాగానికి సంబంధించి వ్యాస రూప ప్రశ్న, లేఖ రాయాల్సి ఉంటుంది. విహారయాత్ర, పుస్తక్ ఖరీదేనా, హిందీ సికనేకీ ఆవశ్యకత్‌లలో వచ్చే అవకాశముంది.

- ఎ.భానుమతి, హిందీ ఉపాధ్యాయిని



ఆంగ్లంపై ఆందోళన వద్దు

పేపరు మూడు భాగాలుగా ఉంటుంది. సెక్షన్-ఏలో రీడింగ్ కాంప్రెహెన్షన్ 30 మార్కుల్లో 24 మార్కులు బహుళైచ్ఛిక ప్రశ్నలు, ఆరు మార్కులు సాధారణ ప్రశ్నలు ఉంటాయి. 1 నుంచి 15,16,17 ప్రశ్నలపై దృష్టి సారిస్తే మార్కులు సులువుగా వస్తాయి. సెక్షన్-బిలో ఒకాబులరీ, గ్రామర్‌కు 40 మార్కులు. మొత్తం పాఠ్యాంశాలు బాగా చదివితే మంచి 18 నుంచి 34 వరకూ ప్రశ్నలకు సమాధానాలు రాసి మార్కులు సాధించవచ్చు. సెక్షన్-సి 30 మార్కుల్లో 35వ ప్రశ్న డైరీ రైటింగ్, 36వ ప్రశ్న లెటర్ రైటింగ్, 37వ ప్రశ్న పేరాగ్రాఫ్ రైటింగ్ ఉంటాయి. క్రియేటివ్, లెటర్ రైటింగ్, కన్వర్షన్, బయోగ్రఫీ ప్రశ్నలు సాధన చేయాలి. - ఆర్.నరసింగరావు, ఇంగ్లీషు ఉపాధ్యాయులు

సాంఘికశాస్త్రంలో భావనలే కీలకం



ఇందులో 33 ప్రశ్నలు,4 సెక్షన్లు ఉంటాయి. జాగ్రఫీ, చరిత్ర, పౌరశాస్త్రం, ఆర్థికశాస్త్రం ప్రశ్నలకు 23 చొప్పున మార్కులు. మ్యాప్ పాయింటింగ్‌కు 8 మార్కులు. విద్యార్థులు 4,8 ప్రశ్న లు రాసేటప్పుడు విధిగా సైడ్ హెడ్డింగ్‌లు పెట్టాలి. పాయింట్ల రూపంలో జవాబులు రాస్తూ, ప్రధాన విషయమైతే అండర్‌లైన్ చేయాలి. చేతిరాత ఆకర్షణగా ఉండాలి. మ్యాపు గుర్తింపు అభ్యసనం బాగా చేస్తే సులువుగా గుర్తించవచ్చు. సమాచార నైపుణ్యాల ప్రశ్నలు పట్టిక రూపంలో, గ్రాఫ్ రూపంలో ప్రశ్నలు ఇస్తారు. సులువుగా సమాధానాలు రాయవచ్చు. - ఎం.ప్రభాకరరావు, సోషల్ ఉపాధ్యాయులు

పాఠ్యపుస్తకం బాగా చదవాలి



జీవశాస్త్రం 50మార్కుల పేపర్ 2.సెక్షన్-1లో ఒక మార్కు ప్రశ్నలు 6, 2లో రెండుమార్కుల ప్రశ్నలు 4, 3లో నాలుగు మార్కుల ప్రశ్నలు, 4లో ఎనిమిది మార్కుల ప్రశ్నలు 2. 1,2 సెక్షనల్లో ఐచ్ఛిక ప్రశ్నలుండవు.మూడో సెక్షన్లో 12వ ప్రశ్నకు ఐచ్ఛికం ఉంటుంది. 4వ సెక్షన్‌లో 16,17 ప్రశ్నలకు అంతర్గత ఐచ్ఛిక ప్రశ్నలుంటాయి. జీవక్రియలు, ప్రత్యుత్పత్తి నుంచి ప్రశ్నలుంటాయి. బొమ్మలు, ఆధారిత ప్రశ్నలు, ఫ్లోచార్టులు, ప్రయోగాలు, పట్టికలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి.- డి.విజయభారతి, బయాలజీ టీచర్

సూత్రాలపై పట్టుండాలి



మాథ్స్‌లో నాలుగు సెక్షన్లుంటాయి. సెక్షన్-1లో 12, సెక్షన్-2లో 16, సెక్షన్-3లో 32, సెక్షన్-4లో 40 మార్కులుంటాయి. నిర్వచనాలు, సూత్రాలు, నిర్మాణాలు సాధన చేయాలి. తరచూ లెక్కలు చేస్తుండాలి. వాస్తవ సంఖ్యలు, నిరూపక రేఖా గణితం, రేఖీయ సమీకరణాల పై అవగాహన అవసరం. శ్రేడులు,సాంఖ్యక శాస్త్రం, సంభావ్యతను తరచూ చూడాలి. త్రికోణమితిలో ప్రతి లెక్కను బొమ్మలతో వివరిస్తే మంచి మార్కులు వస్తాయి. ప్రతిలెక్కకూ సూత్రాలను అన్వయించాలి. 1,2 మార్కులకు సూత్రాలు ప్రతి రోజూ చదవాలి. గ్రాఫ్ లెక్కలు గుర్తుంచుకొని జాగ్రత్తలు పాటించాలి. జవాబు పత్రంలో కొట్టివేతలు లేకుండా చూసుకోవాలి.

- కె.నాగజ్యోతి, లెక్కలు ఉపాధ్యాయిని

భౌతిక శాస్త్రం బహు సులభం



ఇది 50 మార్కుల పేపర్. 17 ప్రశ్నలు రాసేందుకు సమయం రెండు గంటలు. ఒక మార్కు ప్రశ్నలు 8, రెండు మార్కుల ప్రశ్నలు 3, నాలుగు మార్కుల ప్రశ్నలు 3 ఉంటాయి.(వీటికి ఛాయిస్ లేదు.) 12వ ప్రశ్న డయాగ్రామ్‌కు ఛాయిస్ ఉంటుంది. 8 మార్కుల ప్రశ్నకు అంతర్గత ఛాయిస్ ఉంటుంది. హ్రస్వదృష్టి, దీర్ఘదృష్టి లోపాల సవరణ, భాష్పీభవనం, మరుగుటకు భేదాలు, ఇంద్రధనస్సు ఏర్పడే విధానం, ఎండమావులు, విద్యుత్ మోటారు ఏసీ,డీసీ, జనరేటర్ పనిచేసే విధానం, క్వాంటం సంఖ్యలు, నూతన ఆవర్తన పట్టిక నిర్మాణాలు, ఆమ్లాలు, క్షారాలు, పరమాణు నిర్మాణం, లోహసంగ్రహణ శాస్త్రంపై పట్టుండాలి. ఘన పదార్థపు విశిష్ట ఉష్ణం కనుగొనుట, సాఖ్యాంతరం, గాజుల దిమ్మె, వక్రీభవన గుణకాలు, ఆమ్ల రసాయన చర్యలు చదవాలి.

- దండు శ్రీనివాసరావు, ఫిజిక్స్ ఉపాధ్యాయులు

జిల్లా ఓటర్లు 20,15,934

» గత ఏడాదితో పోలిస్తే స్వల్ప పెరుగుదల

» పురుషుల కంటే మహిళలు 27,085 అధికం

విశాఖపట్నం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ఓటు హక్కుపై అవగాహన కల్పించే ఉద్దేశంతో ఏటా జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఇందులో ప్రభుత్వశాఖలు, స్వచ్ఛంద సంస్థలు భాగస్థులవుతున్నారు. దీనివల్ల ఏటా ఓటర్లుగా నమోదవుతున్న వారి సంఖ్య పెరుగుతోంది. నేడు జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని సందర్భంగా జిల్లాలో ఓటర్ల వివరాలివి.

జిల్లాలో ప్రత్యేక సంక్షిప్త సవరణ-2025 ప్రకారం తుది ఓటర్ల జాబితాను ఎన్నికల సంఘం ఈ నెల ఆరో తేదీన విడుదల చేసింది. ఈ మేరకు జిల్లాలో మొత్తం ఓటర్లు 20,15,934 మంది ఉన్నారు. వీరిలో పురుషులు 9,94,365, మహిళలు 10,21,450. 119 మంది ట్రాన్స్‌జెండర్లు ఉన్నారు. పురుషులతో పోల్చితే మహిళలు 27,085 మంది అధికంగా ఉన్నారు. గత ఏడాది అక్టోబరులో ముసాయిదా ఓటర్ల జాబితాతో పోల్చితే 1,968 మంది ఓటర్లు పెరిగారు. ఈ నెల ఆరో తేదీన విడుదల చేసిన తుది జాబితా ప్రకారం నియోజకవర్గాల వారీగా ఓటర్ల వివరాలివి.



నియోజకవర్గం	పోలింగ్ కేంద్రాలు	పురుషులు	మహిళలు	ట్రాన్స్‌జండర్లు	మొత్తం
భీమిలి	361	1,78,834	1,85,744	15	3,64,593
విశాఖ తూర్పు	282	1,42,567	1,49,734	20	2,92,326
విశాఖ దక్షిణ	236	1,06,743	1,10,633	33	2,17,409
విశాఖ ఉత్తర	272	1,40,506	1,44,696	22	2,85,224
విశాఖ పశ్చిమ	221	1,05,279	1,08,423	12	2,13,714
గాజువాక	309	1,67,377	1,66,766	12	3,34,155
పెందుర్తి	299	1,53,059	1,55,449	05	3,08,513
మొత్తం	1,980	9,94365	10,21,450	119	20,15,934

నేటి నుంచి చాగంటి ప్రవచనాలు

» వేదిక కొమ్మాది గాయత్రి మహిళా ఇంజనీరింగ్ కళాశాల

కొమ్మాది, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ ప్రవచనకర్త రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరావు ఆధ్యాత్మిక ప్రవచనం శనివారం ప్రారంభం కానుంది. కొమ్మాది గాయత్రి విద్యాపరిషత్ మహిళా ఇంజనీరింగ్ కళాశాల ఆవరణలో మార్చి ఆరో తేదీ వరకు ప్రతిరోజూ సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకు సంపూర్ణరామాయణంపై ప్రవచనం ఉంటుందని చాగంటి కుమారుడు షణ్ముఖచరణ్, అష్టలక్ష్మీదేవాలయం ధర్మకర్త అన్నంరాజు సత్యనారాయణ, గాయత్రి విద్యాపరిషత్ కార్యదర్శి ఆచార్య సోమరాజు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. వాల్మీకి రామాయణంలో వారానికి ఒక ఖండంపై 42 రోజుల పాటు ప్రవచనం ఉంటుందన్నారు. ఇప్పటివరకు చాగంటి రెండుసార్లు మాత్రమే సంపూర్ణ రామాయణ ప్రవచనం చేశారని, ఇది మూడోదన్నారు. కాగా వివిధ దేవాలయాల్లో పూజలు అందుకున్న రామయంత్రం వేదిక వద్దకు చేరిందని, ప్రవచనాలతో పాటు రామయంత్రం దర్శనం ఉంటుందన్నారు. కార్యక్రమానికి హాజరయ్యే వారికి ప్రత్యేక పార్కింగ్ దుపాయం కల్పిస్తున్నామన్నారు. సమావేశంలో మహిళా ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ గోస్వామి, వైస్ ప్రిన్సిపాల్ సుధీర్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆచార్య సోమరాజు, అన్నంరాజు, షణ్ముఖ్, తదితరులు

పారదర్శకంగా స్టాఫ్ నర్సు పోస్టుల భర్తీ

» వైద్య, ఆరోగ్యశాఖ ఆర్డీ రాధారాణి



విశాఖపట్నం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): వైద్య, ఆరోగ్యశాఖ ప్రాంతీయ కార్యాలయ పరిధిలో ఖాళీగా ఉన్న 106 స్టాఫ్‌నర్సు పోస్టుల భర్తీ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా నిర్వహిస్తున్నామని రీజనల్ డైరెక్టర్ డాక్టర్ పి.రాధారాణి పేర్కొన్నారు. పోస్టుల భర్తీలో దళారుల ప్రమేయం పెరిగిందన్న కథనాల నేపథ్యంలో ఆమె శుక్రవారం మీడియాతో మాట్లాడారు. 106 పోస్టులకు 8,310 మంది దరఖాస్తు చేశారన్నారు. వాటిని పరిశీలిస్తున్నామన్నారు. దళారుల మాటలు నమ్మవద్దన్నారు. సీనియారిటీ, మెరిట్, రిజర్వేషన్లు మేరకు భర్తీ చేస్తామన్నారు. రాజకీయ నేతల సిఫార్సులపై మాట్లాడుతూ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహిస్తున్నామని వారికి వివరించామన్నారు. కొంతమంది అభ్యర్థులు సర్టిఫికెట్లను జత చేయలేదన్నారు. కొద్ది రోజుల్లో ప్రొవిజినల్ సీనియారిటీ జాబితాను వెల్లడిస్తామని, అనంతరం మూడు రోజులు అభ్యంతరాలు స్వీకరిస్తామన్నారు. దళారులను నమ్మి మోసపోవద్దని, అలాంటి వారి వివరాలను అందిస్తే పోలీసులకు ఫిర్యాదు చేస్తామన్నారు.

దేశభక్తిని రగిలించే జనగణమన



జాతీయ గీతాన్ని ఆలపిస్తున్న మేయర్ హరి వెంకటకుమారి, ఇతరులు



బృందగానంలో పాల్గొన్న వివిధ కళాశాలల విద్యార్థులు

» మేయర్ హరి వెంకటకుమారి

» ఎంవీపీ కాలనీలో మార్మోగిన బృందగానం

ఎంవీపీ కాలనీ, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): నోబెల్ బహుమతి గ్రహీత రవీంద్రనాథ్ ఠాగూర్ కలం నుంచి జాలువారిన జాతీయ గీతం జనగణమన ప్రజల్లో దేశభక్తిని రగిలించడమే కాకుండా దేశ ఖ్యాతిని నలు దిశలా వ్యాపింపచేస్తోందని నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి అన్నారు. ఎంవీపీ కాలనీ ఏఎస్ రాజా మైదానంలో శుక్రవారం ఉదయం స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మేయర్ మాట్లాడుతూ 1950 జనవరి 24న జనగణమన గీతాన్ని జాతీయ గీతంగా గుర్తించి, రాజ్యాంగంలో పొందు పరచిన సందర్భంగా ఈ కార్యక్రమాన్ని యాక్మీ అనే సంస్థ నిర్వహించిందన్నారు. ప్రతి నెల మూడో శనివారం శ్రమదానం చేసి, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన పిలుపు మేరకు విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. నగరంలోని వివిధ విద్యా సంస్థల నుంచి సుమారు రెండు వేల మంది గీతాలాపనకు హాజరయ్యారు. జీవీఎంసి ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్ కుమార్, అక్వార్‌దాస్ విద్యా సంస్థల ప్రతినిధి రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

క్రైం... crime news

ద్విచక్ర వాహనం అదుపు తప్పి వ్యక్తి మృతి

ఎండాడ, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనం అదుపు తప్పడంతో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన మారికవలస జాతీయ రహదారిపై జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నగరంలోని పందిమెట్ట సూర్యానగర్‌కు చెందిన ఈడిబిల్లి వెంకటసన్యాసి నాయుడు (44) కూలీ పనులు చేస్తుంటాడు. ఈ నెల 21న తన స్వగ్రామం విజయనగరం జిల్లా గజపతినగరం మండలం చినకాడ వెళ్లాడు. తిరగి శుక్రవారం ద్విచక్ర వాహనంపై నగరానికి బయలుదేరాడు. ఈ క్రమంలో మారికవలస జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనం అదుపు తప్పి పడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు కేజీహెచ్‌కి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య ఈడిబిల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు పీఎంపాలెం పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

లిఫ్ట్ డోర్ ఓపెన్ కావడంతో ఒకరు...

ఎండాడ, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): అర్థాంతరంగా లిఫ్ట్ డోర్ ఓపెన్ కావడంతో ఐదో ఫ్లోర్ నుంచి రెండో ఫ్లోర్‌కి లిఫ్ట్‌పై పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ద్వారపూడి త్రిమూర్తులు (56) కార్పెంటర్. ఇతడి స్వస్థలం అనకాపల్లి జిల్లా గొలుగొండ మండలం. ద్వారపూడి రాజేష్, ద్వారపూడి గోవింద్, ద్వారపూడి పరమేశ్, మున్నే నాగేశ్వరరావుతో కలిసి శుక్రవారం పీఎంపాలెంలోని ఎస్డీఎస్ వినాయక నివాసంలోని ఐదో అంతస్థులో కొన్ని వస్తువులు చేర్చారు. అనంతరం అందరినీ కింద సెల్లార్‌లో ఉండమని పంపి, త్రిమూర్తులు లిఫ్ట్ బటన్ నొక్కడంతో లిఫ్ట్ డోర్ అర్థాంతరంగా తెరచుకుంది. లోపలకి వెళ్లేందుకు ప్రయత్నించగా రెండో ఫ్లోర్‌లో ఉన్న లిఫ్ట్‌పై పడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి, వెంటనే కేజీహెచ్‌కి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుని భార్య ద్వారపూడి లక్ష్మి ఫిర్యాదు మేరకు పీఎంపాలెం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య

గోపాలపట్నం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసైన ఓ వ్యక్తి మద్యం మత్తులో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల తెలిపిన వివరాల మేరకు ఎల్లపువానిపాలెం గ్రామానికి చెందిన ఇ.వెంకటరావు(40) తాపీమేస్త్రి, మద్యానికి బానిసై తరచూ కుటుంబసభ్యులతో గొడవ పడేవాడు. ఈ క్రమంలో గురువారం రాత్రి పూటుగా మద్యం సేవించి భార్యా పిల్లలు నిద్రిస్తున్న సమయంలో గదిలో ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఉదయం నిద్ర నుంచి మేల్కొన భార్య లక్ష్మి గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించి సీఐ అప్పారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఒంగోలులో నకిలీ మహిళా ఐఏఎస్

» అదుపులోకి తీసుకున్న ఎంవీపీ పోలీసులు

ఎంవీపీ కాలనీ, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ట్రైనీ ఐఏఎస్‌ను అని చెప్పుకుంటూ, ఉద్యోగాలు ఇప్పిస్తానని భారీగా డబ్బులు వసూలుచేసిన అమృత భాగ్యరేఖను ఎంవీపీ పోలీసులు శుక్రవారం ఒంగోలులో అదుపులోకి తీసుకుని నగరానికి తీసుకువస్తున్నారు. ఇప్పటికే చాలామందిని మోసంచేసిన ఈమెపై త్రీటౌన్, కంచరపాలెం, భీమిలి స్టేషన్లలో కేసులున్నట్టు సమాచారం. తాజా ఫిర్యాదు నేపథ్యంలో ఎంవీపీ పోలీసులు నగరంలోని ఆమె ఇంటికి వెళ్లి విచారించారు. ఆ తర్వాత స్టేషన్ ఆవరణలోనే ఆమె చాలాసేపు ఉందని స్థానికులు చెబుతున్నారు. అయితే కేసు తీవ్రతను గుర్తించని పోలీసులు పట్టించుకోలేదంటున్నారు. అరెస్టు చేసే అవకాశాలున్నాయని అనుమానం రావడంతో భాగ్యరేఖ పరారయింది. దీంతో గాలింపు చేపట్టారు. ఎట్టకేలకు ఒక బృందం ఆమె ఒంగోలులో గుర్తించి అదుపులోకి తీసుకుని విశాఖ తీసుకు వస్తున్నారని పోలీసులు తెలిపారు. కాగా ఆమెను అదుపులోకి తీసుకున్న సందర్భంలో తీవ్రంగా ప్రతిఘటించిందని తెలిసింది. ఇదిలా ఉండగా ఈ కేసుపై పోలీసులు గోప్యత పాటిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

సద్దుమణిగిన బాలికల సదన్ వివాదం

» మరో బాలికను శ్రీకాకుళం పంపిన అధికారులు

ఆరిలోవ, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): గత మూడురోజులకు కొనసాగుతున్న బాలికల ప్రత్యేక వసతిగృహం విద్యార్థినుల వివాదం సద్దుమణిగింది. బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఛైర్మన్ కేసలి అప్పారావు బుధవారం హోంని అధికారులతో చర్చించారు. వివాదానికి కారణమైన ముగ్గురిని గురువారం స్వస్థలాలకు పంపిన అధికారులు శుక్రవారం మరో బాలికను ఆమె తల్లితో శ్రీకాకుళం పంపించారు. కాగా అనంతపురానికి చెందిన బాలిక కేసు హైకోర్టు పరిధిలోఉందని, కోర్టు ఉత్తర్వుల మేరకు చర్యలుంటాయన్నారు.

జిల్లాలో గీత కులాలకు 14 మద్యం దుకాణాలు



లాటరీ తీస్తున్న కలెక్టర్ హరేంధిరప్రసాద్

మహారాణిపేట, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) జిల్లాలో గీత కులాలకు 14 మ ద్యం దుకాణాలను కేటాయించారు. కలెక్టరేట్‌లో కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ ఆధ్వర్యంలో ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ రామచంద్రరావు, ప్రసాద్, శుక్రవారం లాటరీ ప్రక్రియ నిర్వహించారు. మొత్తం 14 దుకాణాలకు 11 జీవీఎంసీ పరిధిలో ఉండగా, భీమిలి, ఆనందపురం, పద్మనాభంలో ఒక్కొక్కటి ఉన్నాయి. నగరంలోని 11 దుకాణాల్లో గౌడ, యాత కులాలకు ఒక్కొక్కటి, మిగిలిన 9 శెట్టిబలి జలకు దక్కాయి. ఆనందపురం గౌడలకు, భీమిలి, పద్మనాభం శెట్టి బలిజలకు వచ్చాయన్నారు. ఈ నెల 27న గెజిట్ విడుదల చేస్తామని, ఫిబ్రవరి 5న దరఖాస్తుల స్వీకరణ, 6న పరిశీలన, 7న తుది లాటరీ నిర్వహిస్తామన్నారు.

కేజీహెచ్ ఏడీగా సుమతి బాధ్యతల స్వీకరణ



ఏడీకి శుభాకాంక్షలు తెలుపుతున్న ఉద్యోగులు

విశాఖపట్నం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): కేజీహెచ్ అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడీ)గా బీఎస్ సుమతి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు వైద్య, ఆరోగ్యశాఖ జిల్లా కార్యాలయంలో ఏవోగా పనిచేసి పదోన్నతిపై వచ్చారు. ఈ సందర్భంగా ఆమెకు ఏవో మం గరాజు, ఎంఆర్‌వో జవహర్‌లాల్, సీనియర్ అసిస్టెంట్లు శ్రీను, ప్రకాష్, జూనియర్ అసిస్టెంట్ శివ, సోషల్ వర్కర్ చిట్టిబాబు శుభాకాంక్షలు తెలిపారు.

కుంభమేళా ప్రత్యేక రైళ్లకు కొత్తవలసలో హాల్ట్

విశాఖపట్నం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): యాత్రికుల డిమాండ్ మేరకు విశాఖ-గోరఖ్‌పూర్, విశాఖ-దీన్ దయాల్ ఉపాధ్యాయల మధ్య నడుస్తున్న కుంభమేళా ప్రత్యేక రైళ్లకు కొత్తవలస స్టేషన్‌లో హాల్ట్ కల్పిస్తున్నామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. విశాఖ-దీన్ దయాల్ ఉపాధ్యాయ ప్రత్యేక రైలు ఫిబ్రవరి 6, 20, 27న (ప్రతి గురువారం) సాయంత్రం 5.35 గంటలకు విశాఖలో బయలుదేరి 6.05 గంటలకు కొత్తవలస చేరుకుని అక్కడ నుంచి 6.07 గంటలకు బయలుదేరుతుందన్నారు. తిరుగు ప్రయాణంలో ఈ నెల 25, ఫిబ్రవరి 8, 22, మార్చి 1న రాత్రి 8.10 గంటలకు దీన్ దయాల్ ఉపాధ్యాయలో బయలుదేరి సోమవారం వేకువజాము 2.36 గంటలకు కొత్తవలస, 3.25 గంటలకు విశాఖ చేరుతుందన్నారు. విశాఖ-గోరఖ్‌పూర్ ప్రత్యేక రైలు ఫిబ్రవరి 16న (ఆదివారం) రాత్రి 10.20 గంటలకు విశాఖలో బయలుదేరి 10.48 గంటలకు కొత్తవలస చేరుకుంటుంది. అక్కడ 10.50 గంటలకు బయలుదేరి మంగళవారం రాత్రి 8.25 గంటలకు గోరఖ్‌పూర్ చేరుతుంది. తిరుగు ప్రయాణంలో ఫిబ్రవరి 19న (బుధవారం) మధ్యాహ్నం 2.20 గంటలకు గోరఖ్‌పూర్‌లో బయలుదేరి శుక్రవారం ఉదయం 11.22 గంటలకు కొత్తవలస, మధ్యాహ్నం 12.15 గంటలకు విశాఖ చేరుతుందన్నారు.

85 మంది పోలీసు సిబ్బందికి రివార్డులు

మహారాణిపేట, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో ప్రతిభ కనబరి చిన 85 మంది నగర పోలీసు సిబ్బంది, అధికారులకు పోలీసు కమిషనర్ డా. శంఖబ్రత బాగ్చి రివార్డులు అందజేశారు. ప్రతీ నెల ఉత్తమ ప్రతిభ కనబరిచినవారికి రివార్డులు ఇస్తుంటారు. శుక్రవారం కమీషనరేట్‌లో నిర్వహించిన సమావే శంలో హోంగార్డు నుంచి సీఐ స్థాయి అధికారి వరకు రివార్డులు అందించారు.